
జడ్చర్ల మండలం ఈర్లపల్లి తండాలో అధికారులు స్వాధీనం చేసుకున్న బీజీ-3 రకం నిషేధిత పత్తి విత్తనాలు

నకిలీ పంజా

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నకిలీ విత్తనాల దందా

- మూలాలను నియంత్రించకపోవడంతో యథేచ్ఛగా దందా
- మల్దకల్‌లో గత నెలలో 56 బస్తాల లూజు సీడ్స్ పట్టివేత
- జడ్చర్లలో కొన్ని రోజులుగా పట్టుబడుతున్న బీజీ-3 వంగడాలు
- ఫెయిల్ అయిన విత్తనాలను క్రష్ చేయించకపోవడమే ప్రధాన కారణం
- సీజన్ వచ్చినప్పుడే అధికారుల తనిఖీలు..
- ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు అవసరం



మహబూబ్‌నగర్, మే 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఏటా నకిలీ విత్తనాల విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. వర్షాకాలం ప్రారంభమయ్యే సమయంలో ఈ నకిలీ విత్తనాలను అరికట్టడానికి ప్రభుత్వం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తోంది. అయినా కూడా కొందరు రైతులు వాటిని కొనుగోలు చేస్తున్నారు. కొన్ని విత్తనాలు నకిలీ బ్రాండ్ల పేరుతో వస్తుండగా.. మరికొన్ని చోట్ల లూజు, నిషేధిత బీజీ-3 విత్తనాలను రైతులకు అంటగడుతున్నారు. వాటిని సాగు చేసిన రైతులు దిగుబడి సరిగా రాక, నష్టపోతున్నారు. మితిమీరిన పురుగు మందుల వాడకం వల్ల నష్టపోయారని అధికారులు తమ నివేదికల్లో రాసి, చేతులు దులుపుకుంటున్నారు. నకిలీ విత్తనాలను అరికట్టడానికి అయితే ఇప్పటివరకు శాశ్వత ప్రాతిపదికన ప్రత్యేక వ్యవస్థ లేకుండా పోయింది. కంపెనీలు ఫౌండేషన్ సీడ్ ఇచ్చి, సాగుచేసే దగ్గర నుంచి విత్తన ప్యాకెట్లు చేసి విక్రయించే వరకు క్వాలిటీ, కంట్రోల్ అనేది పూర్తిగా కంపెనీల చేతుల్లోనే ఉంటోంది. ప్రభుత్వం కేవలం సీజన్ ప్రారంభయ్యే సమయంలో నకిలీ విత్తనాలను అరికట్టడానికి వ్యవసాయ, పోలీసు అధికారులతో సంయుక్తంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తోంది. అయితే సరఫరా అవుతున్న మొత్తం విత్తనాల్లో పట్టుబడుతున్న నకిలీ విత్తనాల శాతం చాలా తక్కువ మొత్తమేనని చెప్పొచ్చు. ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయడం ద్వారా కంపెనీలు ఫౌండేషన్ సీడ్ ఇచ్చే దగ్గర నుంచి, సీడ్ ఉత్పత్తి, జీవోటీ, క్వాలిటీ, కంట్రోల్, విత్తనాల విక్రయాల వరకు పరిశీలన ఉంటుందనే అభిప్రాయం వస్తోంది.


ఏప్రిల్ 16న మల్దకల్ మండలంలో అధికారులు స్వాధీనం చేసుకున్న 51 కేజీల లూజు విత్తనాలు (ఫైల్)

మూలాలపై నియంత్రణ కరువు..

నకిలీ పత్తి విత్తనాలను అరికట్టాలంటే కేవలం సీజన్‌లో తనిఖీలు చేయడం, అడపాదడపా విత్తనాలను పట్టుకుని కేసులు నమోదు

(మిగతా 7లో..)

కేసులవుతున్నా.. ఆగని దందా..

సీజన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాల తనిఖీల్లో నకిలీ విత్తనాలు పట్టుపడి, పలుమార్లు కేసులు నమోదవుతున్నా దందా మాత్రం ఆగడం లేదు. లూజు విత్తనాలను నిల్వ ఉంచిన ఘటనలు ఎక్కువగా మల్దకల్ మండలంలో జరుగుతున్నాయి. 2023లో ఓసారి దాదాపు 30 క్వింటాళ్ల పైచిలుకు విత్తనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల అదే మండలం కుర్తిరావుల చెరువులో 51 బస్తాల లూజు విత్తనాలను పట్టుకున్నారు. 2022లో ఉండవల్లి మండలంలో నకిలీ బ్రాండ్ల పేరుతో సరఫరా చేస్తున్న 16.75 క్వింటాళ్ల విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. 2024లో నారాయణపేట, మక్తల్, ఉండవల్లి, కొడంగల్ మండలాల్లో కలిపి 37.14 క్వింటాళ్ల విత్తనాలను పట్టుకున్నారు. కేసులు కూడా నమోదయ్యాయి. గత సంవత్సరం జడ్చర్ల మండలం గోప్లాపూర్‌లో నిషేధిత బీజీ-3 రకం 3.20 క్వింటాళ్లను పట్టుకున్నారు. తాజాగా శుక్రవారం అదే గ్రామంలో 3 కిలోల విత్తనాలను అధికారులు పట్టుకోగా.. శనివారం జడ్చర్ల మండలంలోని ఈర్లపల్లి తండాలో 50 కిలోల బీజీ-3 విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. వేలాది క్వింటాళ్ల విత్తనాలు ఇలా పట్టుబడుతూనే ఉన్నాయి. మూలాలను నియంత్రించకపోతే ఈ దందా ఆగడం కష్టమేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

50 కిలోల నిషేధిత పత్తి విత్తనాలు పట్టివేత

- జడ్చర్ల మండలం ఈర్లపల్లి తండాలో ఘటన

జడ్చర్ల, మే 24 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం ఈర్లపల్లి తండాలో శనివారం 50 కిలోల బీజీ-3 రకం నిషేధిత పత్తి విత్తనాలను వ్యవసాయ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ బృందాలు స్వాధీనం చేసుకున్నాయి. జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేశం, సీఐ కమలాకర్‌లు వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. ఈర్లపల్లి తండాలో మెఘావత్ చంద్రియానాయక్ వద్ద 35 కిలోలు, మెఘావత్ రవినాయక్ ఇంటిలో 15 కిలోల నిషేధిత బీజీ-3 రకం పత్తివిత్తనాలు లభ్యమయ్యాయని తెలిపారు. ఈ పత్తి విత్తనాలను ఎక్కడి నుంచి తీసుకువచ్చారని ఆరా తీయగా జడ్చర్ల పట్టణానికి చెందిన కృపాకర్‌రెడ్డి అనే వ్యక్తి రెండు రోజుల క్రితం సరఫరా చేసి, పత్తి పంటను వేయాలని, కొత్తరకం విత్తనాలతో ప్రయత్నం చేయాలని సూచించాడని చెప్పారన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు. ఈ సోదాలలో జడ్చర్ల ఎస్ఐ జయప్రసాద్, జడ్చర్ల ఇన్‌చార్జి ఏడీఏ కృష్ణకిశోర్, ఏవో గోపీనాథ్ పాల్గొన్నారు.

పాఠశాలలు విద్యార్థులతో కళకళలాడాలి

- శిక్షణలో నేర్చుకున్న నూతన టెక్నాలజీతో బోధన చేయాలి
- సర్వశిక్షా అభియాన్ జేడీ వెంకటనర్సమ్మ


కుట్టిన స్కూల్ యూనిఫామ్స్ వివరాలను పరిశీలిస్తున్న జేడీ

నారాయణపేట, మే24(ఆంధ్రజ్యోతి) విద్యా సంవత్సరం ఆరంభం కానున్న దృష్ట్యా ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో అధిక సంఖ్యలో చేర్పించాలని, పాఠశాలలు వారితో కళకళలాడాలని సర్వశిక్షా అభియాన్ జేడీ వెంకట నర్సమ్మ అన్నారు. శనివారం ఆమె నారాయణపేట గ్రౌండ్ ఉన్నత పాఠశాల, జాజాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో కొనసాగుతున్న ఉపాధ్యాయుల శిక్షణా శిబిరాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రెండు విడతల్లో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. తరగతి గదిలో నూతన టెక్నాలజీ ఆధారంగా బోధన చేయాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఆచరణలో పెట్టి, విద్యార్థులను ప్రయోజకులను చేయాలన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు ప్రశ్నలు వేశారు. బడి బాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అంతకు ముందు నారాయణపేట సింగార్‌బేస్ పాఠశాలలో భద్రపరిచిన పాఠ్యపుస్తకాలు పరిశీలించారు. మహిళా సంఘాలు విద్యార్థులకు యూనిఫామ్స్ కుడుతున్న కమ్యూనిటీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. దుస్తుల సైజులను పరిశీలించారు. ఇప్పటి వరకు 8,257 జతల దుస్తులు కుట్టామని మహిళలు జేడీకి వివరించారు. దుస్తులు సకాలంలో కుట్టి, అందించాలని చెప్పారు. జూన్ 12న పాఠశాలల ప్రారంభం రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు స్కూల్ డ్రెస్‌లు అందించనున్నట్లు చెప్పారు. నారాయణపేట క్రీడా మైదానంలో పీఈటీ, పీడీలు ఇస్తున్న క్రీడా శిక్షణలను పరిశీలించారు. కార్యాక్రమంలో డీఈవో గోవిందరాజులు, సీఎంవో రాజేంద్రకుమార్, యదయ్యశెట్టి, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.



క్లిక్.. క్లిక్..



కమ్ముకున్న కారుమేఘం

మూడు రోజులుగా అక్కడక్కడ జల్లులతో కూడిన వర్షం కురుస్తోంది. ఒకసారి ఎండ కాస్తుండగా, మరోసారి మేఘాలు కమ్ముకుంటూ వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. వానాకాలం సీజన్ దగ్గరికొస్తుండటంతో సాలు వచ్చే వాన కురిస్తే భూమి దున్నేందుకు రైతులు ఎదురు చూస్తున్నారు. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం వెళ్లే దారిలో సాయంత్రం ఆకాశం మబ్బులతో నిండిపోయింది. వర్షం వస్తుందేమోనని రైతులు ఆకాశం వైపు చూశారు.

– ఆంధ్రజ్యోతి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ వనపర్తి

యువకుడి అవయవదానం

- ఈనెల 21న బైక్ పై నుంచి కిందపడిన మహబూబ్‌నగర్ వాసి
- బ్రెయిన్‌డెడ్‌తో అవయవాలు దానం

హైదరాబాద్ సిటీ, మే 24 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడి అవయదానంతో ఐదుగురికి పునర్జన్మ లభించింది. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన విద్యార్థి అజ్మీర రాజశేఖర్(21) ఈ నెల 21వ తేదీన ద్విచక్రవానంపై వెళ్తుండగా కింద పడ్డాడు. వెంటనే అతన్ని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం బ్రెయిన్‌డెడ్ అయ్యింది. దీంతో అవయదానంపై అతని కుటుంబ సభ్యులకు జీవన్‌దాన్ కోఆర్డినేటర్స్ అవగాహన కల్పించారు. వారి అంగీకారంతో కాలేయం, రెండు మూత్రపిండాలు, రెండు కార్నియాలను సేకరించారు. వారిని అవసరమైన బాధితులకు మార్పిడి చేసినట్లు జీవన్‌దాన్ నోడల్ ఆఫీసర్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీభూషన్‌రాజు తెలిపారు.

మహిళా సంఘాల బలోపేతానికి కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

పాలమూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): మహిళలు అభివృద్ధిలోకి రావాలని, అందుకోసం మహిళా సంఘాలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మునిసిపల్ ఆవరణలో గల మెప్మా భవనంలో ఆర్‌పీలకు తన నిధులతో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా సంఘాలలో పని చేస్తున్న ఆర్‌పీలకు కంప్యూటర్ పరిజ్ఞానం అవసరమని భావించి, మహబూబ్‌నగర్ మొదటి నవరత్నాలు కార్యక్రమంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ ఏర్పాటు చేశామన్నారు. కొన్ని రాష్ట్రాల్లో మహిళా సంఘాల వివరాలు కంప్యూటరీకరణ చేస్తున్నారని, భవిష్యత్తులో మన దగ్గర ఆ అవకాశం వస్తే ఆర్పీలు వెనుకబడే అవకాశం ఉందన్నారు. ఇప్పుడే వారు కంప్యూటర్ నేర్చుకుని, సంఘాల డేటాను క్రోడీకరించి, కంప్యూటర్‌లో నిక్షిప్తం చేయడం నేర్చుకుంటే ఆ ఇబ్బంది ఉండదన్నారు. మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న అప్పు వివరాలు, చెల్లింపులు, ఇతర సమాచారం ఒకే ఒక్క క్లిక్‌తో ఒకే చోట తెలుసుకోవచ్చన్నారు. కంప్యూటరీకరణతో అవకతవకలకు చోటులేకుండా పారదర్శకంగా పని జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ఆర్‌పీలు ఉపయోగించుకుని కంప్యూటర్‌పైన అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ముడా ఛైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మల్లు నరసింహారెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ బెక్కరి అనిత, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, అజ్మత్‌అలీ, నవరత్నాలు పర్యవేక్షకుడు గుండా మనోహర్, రామచంద్రయ్య, రఘు, జహీర్, ప్రవీణ్‌కుమార్, అక్బర్, కమిషనర్ మహేశ్వరరెడ్డి, డీఎంసీ ఎం.లక్ష్మి, టీఎంసీ వరలక్ష్మి పాల్గొన్నారు.

రేషన్ షాపులో ఈటీఎఫ్ బృందం తనిఖీలు

- ఏడు క్వింటాళ్ల బియ్యం అధికంగా ఉన్నట్లు నిర్ధారణ
- పెదిరెపాడ్ డీలర్‌పై పీడీఎస్ చట్టం కింద కేసు నమోదు


పెదిరెపాడ్ రేషన్ షాపులో రికార్డులు పరిశీలిస్తున్న తనిఖీ బృందం

మద్దూర్, మే 24 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మద్దూరు మండలంలోని పెదిరెపాడ్‌లో గల రేషన్‌షాపులో హైదరాబాద్ నుంచి వచ్చిన ఈటీఎఫ్(ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్) బృందం అధికారులు శనివారం ఆకస్మిక తనఖీలు నిర్వహించారు. నిల్వలను పరిశీలించారు. 129.06 క్వింటాళ్లకు గాను 97.50 క్వింటాళ్లు పంపిణీ చేయగా, 31.56 క్వింటాళ్లు మిగులు ఉండాలి. అయితే 38.56 క్వింటాళ్లు ఉన్నాయి. ఉన్న వాటికంటే 7 క్వింటాళ్లు(14 బస్తాలు) బియ్యం అధికంగా ఉన్నట్టు తనిఖీల్లో తేలింది. నిబంధనలకు విరుద్ధంగా నిల్వలు ఉండటంతో షాపు డీలర్ నాగేశ్వర్‌రెడ్డిపై పీడీఎస్ చట్టం 6ఏ కింద కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఆనంద్ తెలిపారు.

ఉపాధ్యాయులకు ముగిసిన రెండో విడత శిక్షణ

- కేంద్రాలను పర్యవేక్షించిన డీఈవో ప్రవీణ్‌కుమార్, ఏఎంవో దుంకుడు శ్రీనివాస్, సీఎంవో బైకని బాలుయాదవ్
- 26 నుంచి మూడో విడత ట్రైనింగ్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం మే 24 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యం లో ఉపాధ్యాయులకు చేపట్టిన రెండో విడత శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ శిక్షణ కేంద్రాలను డీఈవో ప్రవీణ్‌కుమార్, ఏఎంవో దుంకుడు శ్రీనివాస్, సీఎంవో బైకని బాలుయాదవ్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి నిత్యం కృషి చేయాలన్నారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మధన్‌మోహన్‌యాదవ్ మాట్లాడుతూ శిక్షణ వల్ల ఉపాధ్యాయులు కొత్త విషయాలు నేర్చుకు నాన్నరన్నారు. మూడో విడత శిక్షణ ఈ నెల 26 నుంచి ప్రారంభం కానుంది.

- జడ్చర్ల : రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణలో గడిచిన ఐదు రోజుల్లో నేర్చుకున్న అంశాలను పాఠశాలలో అమలు చేయాలని ఎంఈవో మంజులాదేవి అన్నారు. జడ్చర్ల జడ్పీహెచ్ఎస్‌లో జడ్చర్ల మండలంలోని ఉపాధ్యాయులకు నర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. ఎమ్మార్పీలు కృష్ణగౌడ్, లోక్య, నరేశ్, బోప్యానా యక్, శివరాములు, శంకర్, విజయలక్ష్మీ, డీఆర్పీ శేషసేనారెడ్డి పాల్గొన్నారు.

రెండు ఎలిమెంట్లతో నీటి వృథాకు చెక్

- చివరి దశకు చేరిన మరమ్మతు పనులు
- ఎగువ నుంచి 4వేల క్యూసెక్కులకు పైగా వరద

7


జూరాల ప్రాజెక్టులోకి చేరిన వరద

దేశాన్ని రక్షించడంలో మోదీ విఫలం


- మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

7


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

మలేసియా మాస్టర్స్

ఫైనల్‌కు శ్రీకాంత్



కౌలాలంపూర్: ఎన్నాళ్లకెన్నాళ్లకు.. అప్పుడెప్పుడో 2019లో ఇండియా ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన తెలుగు షట్లర్ కిడాంబి శ్రీకాంత్ ఆరేళ్ల తర్వాత ఓ బీడబ్ల్యూఎఫ్ టూర్ ఈవెంట్‌లో ఫైనల్‌కు చేరాడు. ఫామ్‌లేమికి చెక్ పెడుతూ, తన జోరు కొనసాగిస్తూ కిడాంబి.. మలేసియా మాస్టర్స్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో టైటిల్‌ఫైట్‌కు దూసుకెళ్లాడు. శనివారం ఇక్కడ జరిగిన సింగిల్స్ సెమీఫైనల్లో 32 ఏళ్ల శ్రీకాంత్ 21-18, 24-22తో జపాన్‌కు చెందిన యుషి తనకను ఓడించాడు. ఆదివారం జరిగే తుదిపోరులో చైనా షట్లర్ లి షి ఫెంగ్‌తో శ్రీకాంత్ అమీతుమీ తేల్చుకోనున్నాడు.

పంజాబ్‌కు పంచ్

విజయంతో ఢిల్లీ బైబై

రాణించిన సమీర్ రిజ్వీ ● ముస్తాఫిజుర్‌కు 3 వికెట్లు



సమీర్ రిజ్వీ (58 నాటౌట్)

జైపూర్: టాప్-2లో నిలిచేందుకు పోటీపడుతున్న జట్లకు వరుసగా మూడో రోజూ ప్రతికూల ఫలితమే ఎదురైంది. గుజరాత్, బెంగళూరు తరహాలోనే తాజాగా పంజాబ్ కింగ్స్‌కు పంచ్ పడింది. ఇప్పటికే ప్లేఆఫ్స్ నుంచి తప్పుకొన్న ఢిల్లీ క్యాపిటల్స్ తమ చివరి లీగ్ మ్యాచ్‌లో అదరగొట్టింది. అగ్రస్థానంపై కన్నేసిన పంజాబ్‌పై శనివారం జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో నెగ్గింది. తద్వారా 15 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచింది. భారీ ఛేదనలో సమీర్ రిజ్వీ (25 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్లతో 58 నాటౌట్) అజేయ అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 206 పరుగులు చేసింది. శ్రేయాస్ అయ్యర్ (34 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 53), స్టొయినిస్ (16 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 44 నాటౌట్), ఇన్‌గ్లిస్ (12 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 32) రాణించారు. ముస్తాఫిజుర్‌కు 3.. విప్రజ్, కుల్దీప్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో ఢిల్లీ 19.3 ఓవర్లలో 4 వికెట్లకు 208 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు రాహుల్ (35), డుప్లెసి (23) తొలి వికెట్‌కు 55 పరుగులు జోడించారు. ఆ తర్వాత కరుణ్ నాయర్ (44) భారీ షాట్లతో విరుచుకుపడగా.. డెత్ ఓవర్లలో సమీర్ రిజ్వీ పంజాబ్ బౌలర్లను ఆడుకున్నాడు. అతడికి స్టబ్స్ (18 నాటౌట్) సహకరించడంతో ఢిల్లీ ఎలాంటి ఒత్తిడికి గురికాలేదు. చివరి ఓవర్‌లో 8 పరుగులే అవసరమవగా, రిజ్వీ సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించాడు. హర్‌ప్రీత్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా సమీర్ రిజ్వీ నిలిచాడు.

స్టొయినిస్ ధనాధన్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ శ్రేయాస్ నిలకడతో పాటు ఆఖర్లో స్టొయినిస్ జోరుతో జట్టు 200 దాటింది. ఓపెనర్ ప్రియాన్ష్ (6) విఫలమైనా ప్రభ్‌సిమ్రన్-ఇన్‌గ్లిస్ జోడీ చెలరేగింది. ఆరో ఓవర్‌లో 6,4 బాది ఇన్‌గ్లిస్ అవుటైనా పవర్‌ప్లేలో జట్టు 60/2 స్కోరు సాధించింది. రెండో వికెట్‌కు వీరు 47 పరుగులు జత చేశారు. విప్రజ్ బౌలింగ్‌లో స్కూప్ షాట్‌కు వెళ్లి ప్రభ్‌సిమ్రన్ బౌల్డయ్యాక ఆటలో కాస్త వేగం తగ్గింది. అయితే శ్రేయాస్ అర్ధసెంచరీతో జట్టును ఆదుకున్నాడు. నేహల్ (16), శశాంక్ (11) విఫలమైనా కెప్టెన్‌కు స్టొయినిస్ సహకరించాడు. 17వ ఓవర్‌లో అతడి 6,6,4.. శ్రేయాస్ 4తో 25 పరుగులు వచ్చాయి. కానీ కుల్దీప్ ఒకే ఓవర్‌లో శ్రేయాస్, అజ్మతుల్లా (1) వికెట్లు తీశాడు. అయినా 19వ ఓవర్‌లో మరోసారి చెలరేగిన స్టొయినిస్ 6,4,4,6తో 22 రన్స్ రాబట్టాడు. ముస్తాఫిజుర్ ఆఖరి ఓవర్‌లో పది పరుగులే ఇచ్చి జాన్సెన్ (0)ను అవుట్ చేశాడు.

స్కోరుబోర్డు

పంజాబ్: ప్రియాన్ష్ (సి) స్టబ్స్ (బి) ముస్తాఫిజుర్ 6, ప్రభ్‌సిమ్రన్ (బి) విప్రజ్ 28, ఇంగ్లిస్ (స్టంప్డ్) స్టబ్స్ (బి) విప్రజ్ 32, శ్రేయాస్ (సి) మోహిత్ (బి) కుల్దీప్ 53, నేహల్ (సి) డుప్లెసి (బి) ముకేశ్ 16, శశాంక్ (సి) స్టబ్స్ (బి) ముస్తాఫిజుర్ 11, స్టొయినిస్ (నాటౌట్) 44, అజ్మతుల్లా (సి) రిజ్వీ (బి) కుల్దీప్ 1, జాన్సెన్ (సి) స్టబ్స్ (బి) ముస్తాఫిజుర్ 0, హర్‌ప్రీత్ (నాటౌట్) 7, **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 206/8, వికెట్ల పతనం:** 1-8, 2-55, 3-77, 4-118, 5-144, 6-172, 7-174, 8-197; బౌలింగ్: ముకేశ్ 4-0-49-1, ముస్తాఫిజుర్ 4-0-33-3, మోహిత్ శర్మ 4-0-47-0, విప్రజ్ 4-0-38-2, కుల్దీప్ 4-0-39-2.

ఢిల్లీ: రాహుల్ (సి) శశాంక్ (బి) జాన్సెన్ 35, డుప్లెసి (సి) ప్రియాన్ష్ (బి) హర్‌ప్రీత్ 23, కరుణ్ నాయర్ (బి) హర్‌ప్రీత్ 44, అటల్ (సి) అర్ష్‌దీప్ (బి) ప్రవీణ్ దూబే 22, సమీర్ రిజ్వీ (నాటౌట్) 58, స్టబ్స్ (నాటౌట్) 18, **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 19.3 ఓవర్లలో 208/4; వికెట్ల పతనం:** 1-55, 2-65, 3-93, 4-155; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-35-0, అజ్మతుల్లా 4-0-46-0, హర్‌ప్రీత్ బ్రార్ 4-0-41-2, జాన్సెన్ 4-0-41-1, ప్రవీణ్ దూబే 2-0-20-1, స్టొయినిస్ 1.3-0-21-0.

నేటి మ్యాచ్‌లు

గుజరాత్ x చెన్నై — మ.3.30 నుంచి, వేదిక: అహ్మదాబాద్

హైదరాబాద్ x కోల్‌కతా — రా.7.30 నుంచి, వేదిక: ఢిల్లీ

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్	13	9	4	0	18	0.602
పంజాబ్	13	8	4	1	17	0.327
బెంగళూరు	13	8	4	1	17	0.255
ముంబై	13	8	5	0	16	1.292
ఢిల్లీ	14	7	6	1	15	0.011
లఖ్‌నవూ	13	6	7	0	12	-0.337
కోల్‌కతా	13	5	6	2	12	0.193
హైదరాబాద్	13	5	7	1	11	-0.737
రాజస్థాన్	14	4	10	0	8	-0.549
చెన్నై	13	3	10	0	6	-1.030

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

టెస్టుల్లో కొన్నేళ్లుగా జట్టుకు మూలస్తంభాలుగా ఉన్న రోహిత్, కోహ్లీ ఒక్కసారిగా గుడ్‌బై చెప్పడంతో.. సంధి దశలో ఉన్న టీమిండియాను నడిపించే నవతరం నాయకుడిగా శుభ్‌మన్ గిల్ సరికొత్త అధ్యాయానికి నాంది పలకనున్నాడు. యువ సారథిగా భవిష్యత్ భారత జట్టును నిర్మించనున్నాడు. ఇంగ్లండ్ టూర్‌లో గిల్ నూతన ప్రస్థానం ఆరంభం కానుంది. ఐపీఎల్‌లో అదరగొడుతున్న సాయి సుదర్శన్, అర్ష్‌దీప్ సింగ్‌లకు తొలిసారి రెడ్‌బాల్ జట్టులో చోటు దక్కింది. దేశవాళీ క్రికెట్‌లో పరుగుల వరద పారిస్తున్న కరుణ్ నాయర్‌కు ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాడు.

నవతరం నాయకుడు వచ్చాడు



శుభ్‌మన్ గిల్‌కే టెస్టు జట్టు పగ్గాలు

సుదర్శన్, అర్ష్‌దీప్‌కు పిలుపు

- వైస్ కెప్టెన్‌గా రిషభ్ పంత్
- బుమ్రా ఆడేది కొన్ని మ్యాచ్‌లే
- ఫిట్‌నెస్ లేమితో షమి అవుట్



అర్ష్‌దీప్



సుదర్శన్

ముంబై: రోహిత్ శర్మ రిటైర్మెంట్ తర్వాత జట్టు పగ్గాలు అందుకొనేది ఎవరనే సస్పెన్స్‌కు తెరపడింది. ఊహాగానాలకు తగినట్టుగానే భారత టెస్టు జట్టు కొత్త కెప్టెన్‌గా 25 ఏళ్ల శుభ్‌మన్ గిల్‌ను బీసీసీఐ ఎంపిక చేసింది. వచ్చేనెల 20 నుంచి జరిగే ఐదు టెస్టుల సిరీస్ కోసం ఇంగ్లండ్‌లో పర్యటించే టీమిండియాను శనివారం సెలెక్టర్లు ప్రకటించారు. డాషింగ్ బ్యాటర్, 27 ఏళ్ల రిషభ్ పంత్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించారు. రోహిత్, కోహ్లీ రిటైర్మెంట్ తర్వాత సంధి దశలో ఉన్న భారత జట్టుకు అంతగా అనుభవం లేని 18 మంది సభ్యుల జట్టును సెలెక్టర్లు ఎంపిక చేసి ఒకరకంగా సాహసమే చేశారు. 32 టెస్టులు ఆడిన గిల్ 35.05 సగటుతో 1893 పరుగులు చేశాడు. కాగా, ఈ పర్యటన నుంచి పెద్దగా ఆశిస్తున్నదేమీ లేని నేపథ్యంలో గిల్ సాధించే అనుభవం భవిష్యత్‌లో ఉపయోగపడుతుందని సెలెక్టర్లు చెబుతున్నారు. 'ఏడాది క్రితమే గిల్‌పై దృష్టిసారించాం. భవిష్యత్‌లో భారత జట్టును నడిపించగల సామర్థ్యం అతడిలో ఉందని భావించాం' అని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ అన్నాడు. కాగా, సుదీర్ఘ సిరీస్‌కు ఫిట్‌గా ఉండడన్న కారణంతో సీనియర్ పేసర్ మహ్మద్ షమిని జట్టు నుంచి తప్పించారు. అయితే, వైద్యుల సూచనల మేరకు షమిని పరిగణనలోకి తీసుకోలేదని అగార్కర్ తెలిపాడు. అతడి స్థానంలో ఐపీఎల్‌లో అదరగొడుతున్న అర్ష్‌దీప్ సింగ్‌ను తొలిసారి టెస్టులకు ఎంపిక చేసినట్టు చెప్పాడు. 'ఐపీఎల్ సందర్భంగా గతవారం గాయానికి గురైన షమి ఇటీవలే ఎంఆర్ఐ స్కాన్ తీయించుకొన్నాడు. అయితే, సిరీస్‌కు అతను ఫిట్‌గా ఉండడని వైద్యులు తేల్చారు' అని అగార్కర్ తెలిపాడు. మొత్తంగా టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ (2025-27) కోసం భారత జట్టు నిర్మాణం ఇంగ్లండ్ సిరీస్‌తో ఆరంభమవుతుంది. గిల్ భారత టెస్టు జట్టుకు 37వ కెప్టెన్.

ఇంగ్లండ్ టూర్‌కు భారత జట్టు

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), పంత్ (వైస్ కెప్టెన్, వికెట్ కీపర్), యశస్వి జైస్వాల్, రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీశ్ కుమార్, జడేజా, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాశ్ దీప్, అర్ష్‌దీప్, కుల్దీప్ యాదవ్.



నాయర్.. 8 ఏళ్ల తర్వాత

రోహిత్, కోహ్లీ స్థానాల్లో సాయి సుదర్శన్, కరుణ్ నాయర్ జట్టులోకొచ్చారు. ఈ ఐపీఎల్‌లో పరుగుల వరదపారిస్తున్న గుజరాత్ బ్యాటర్ సాయి సుదర్శన్‌కు తొలిసారి పిలుపు అందగా.. ఎనిమిదేళ్ల తర్వాత కరుణ్ రీఎంట్రీ ఇచ్చాడు. ఈ ఐపీఎల్‌లో సుదర్శన్ 638 రన్స్ చేసి టాప్‌స్కోరర్‌గా ఉన్నాడు. ఇక, నాయర్ చివరిసారిగా 2017లో టెస్టు ఆడాడు. సెహ్వాగ్ తర్వాత టీమిండియాలో ట్రిపుల్ సెంచరీ సాధించిన ఆటగాడిగా రికార్డులకెక్కిన కరుణ్.. ఆ తర్వాత అంతగా ఆకట్టుకోలేకపోయాడు. కానీ, దేశవాళీలో మెరుగైన ప్రదర్శనతో సెలెక్టర్ల తలుపులు తడుతూనే ఉన్నాడు. అయితే కోహ్లీ రాజీనామాతో నాయర్‌కు అదృష్టం కలిసొచ్చింది. పేసర్ హర్షిత్ రాణా, బ్యాటర్లు శ్రేయాస్ అయ్యర్, సర్ఫరాజ్ ఖాన్‌లకు జట్టులో చోటు దక్కలేదు. అయితే, సర్ఫరాజ్‌కంటే అనుభవజ్ఞుడైన నాయర్‌కు సెలెక్టర్లు ఓటేశారు. ఆస్ట్రేలియా టూర్‌లో ఆడిన దేవ్‌దత్ పడిక్కల్ ఫిట్‌నెస్ సమస్యలతో చోటు కోల్పోయాడు.

5

పిన్న వయసులో భారత టెస్టు జట్టు సారథిగా ఎంపికైన ఐదో ఆటగాడు గిల్ (25 ఏళ్ల 258 రోజులు). మన్సూర్ అలీఖాన్ పటౌడి (21 ఏళ్లు), సచిన్ (23 ఏళ్లు), కపిల్ దేవ్ (24 ఏళ్లు), రవిశాస్త్రి (25 ఏళ్ల 229 రోజులు).. గిల్ కంటే ముందున్నారు.

బుమ్రాకు ఎందుకు వద్దంటే..?



కెప్టెన్సీ కోసం గిల్‌తోపాటు బుమ్రా పేరు గట్టిగానే వినిపించింది. అయితే, ఫిట్‌నెస్ ఇబ్బందుల కారణంగానే బుమ్రాకు జట్టు పగ్గాలు అప్పగించలేదు. అసలు సిరీస్‌లోని ఐదు టెస్టులకు బుమ్రా అందుబాటులో ఉండడం కష్టమేనని అగార్కర్ అన్నాడు. బుమ్రాపై పని ఒత్తిడి భారం పడకుండా చూడాలని ఫిజియో, వైద్యులు సూచించారు. ఈ క్రమంలో బుమ్రా రెండు, మూడు టెస్టులకే అందుబాటులో ఉండే అవకాశాలున్నాయని అగార్కర్ పేర్కొన్నాడు. రిజర్వు ఓపెనర్‌గా అభిమన్యు ఈశ్వరన్‌ను ఎంపిక చేశారు. అయితే, బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ సామర్థ్యంపై సందేహాలుండడంతో.. శార్దూల్ ఠాకూర్‌కు కూడా జట్టులో చోటిచ్చారు. శార్దూల్ చివరిగా 2023లో టెస్టు ఆడాడు. గత ఇంగ్లండ్ పర్యటనలో ఓవల్ టెస్టులో శార్దూల్ వరుసగా అర్ధ శతకాలు బాదడంతో భారత్ గెలిచిన సంగతి తెలిసిందే.

ఇక 'శుభ్' ఆరంభం!

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

టెస్టుల్లో రోహిత్ వారసుడిగా 25 ఏళ్ల శుభ్‌మన్ గిల్‌కు టెస్టు పగ్గాలు అప్పగించారు. భారత క్రికెట్‌కు వెన్నెముకగా నిలిచిన విరాట్, రోహిత్ దూరమైన వేళ ఈ సంధి దశను అధిగమించేందుకు బీసీసీఐ ఈ యువ ఆటగాడిపై భరోసా ఉంచడం విశేషమే. అరంగేట్రం చేసిన ఐదేళ్లకే కెప్టెన్‌గా అందలం దక్కడంతో గిల్ కెరీర్ గ్రాఫ్‌ను నెటిజన్లు కొనియాడుతున్నారు. 2018 అండర్-19 వరల్డ్‌కప్‌లో పాకిస్థాన్‌పై సెంచరీతో గిల్ అందరి దృష్టినీ ఆకర్షించాడు. అప్పటి కోచ్ ద్రవిడ్ పట్టుబట్టి మరీ గిల్‌ను జట్టులోకి తీసుకున్నాడు. ఆ తర్వాత ఇంగ్లండ్ టూర్‌లో ఇండియా 'ఏ' తరఫున రాణించాడు. అలాగే వెస్టిండీస్ 'ఏ'తో జరిగిన టెస్టులో డబుల్ సెంచరీతో వెనుదిరిగి చూడలేదు. చక్కటి టెక్నిక్, టెంపర్‌మెంట్ కలిగిన బ్యాటింగ్ కారణంగా 2019లోనే వన్డే జట్టులోకొచ్చాడు. అయితే గిల్ సక్సెస్ వెనుక అతడి తండ్రి లఖ్వీందర్ కృషి ఎనలేనిది. కొడుకు దృష్టంతా క్రికెట్‌పైనే ఉండేందుకు తమ గ్రామం నుంచి మొహాలీకి మకాం మార్చాడు. కొన్నేళ్లపాటు బంధువుల వివాహాలకు కూడా హాజరుకాలేదట. అప్పటి త్యాగాలకు ప్రస్తుతం ఘనమైన ప్రతిఫలమే దక్కింది. పాతికేళ్ల వయస్సులోనే సుదీర్ఘ ఫార్మాట్‌లో జట్టును నడిపించే స్థాయికి ఎదిగాడు. మరోవైపు ఈ ప్రయాణం సవాళ్లతో కూడుకున్నదే అయినా.. భారత టెస్టు జట్టు గిల్ ఆధ్వర్యంలో శుభ్ ఆరంభంగా కొనసాగాలని ఆశిద్దాం.





ఆ ఇద్దరి లోటు పూడ్చలేనిది: అగార్కర్

జట్టులో రోహిత్, కోహ్లీ లేని లోటును పూడ్చడం కష్టమేనని అగార్కర్ అన్నాడు. కానీ, రాబోయే ఇంగ్లండ్ టూర్‌లో మిగతా ఆటగాళ్లు ఆ బాధ్యతలు అందుకొంటారని ఆశిస్తున్నట్టు చెప్పాడు. ఈ నెల 7న రోహిత్ రిటైర్మెంట్ ప్రకటించగా.. 12న కోహ్లీ టెస్టుల నుంచి వైదొలుగుతున్నట్టు బాంబ్ పేల్చాడు. అయితే, చాంపియన్స్ ట్రోఫీ తర్వాత గత నెలలోనే తాను టెస్టు క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాలనుకొంటు న్నట్టు కోహ్లీ తనకు చెప్పాడని అగార్కర్ తెలిపాడు.

'25' వేటలో జొకో!

సోనీ లివ్‌లో మ. 2.30 నుంచి

- నేటి నుంచి ఫ్రెంచ్ ఓపెన్
- ఫేవరెట్లుగా అల్కారజ్, సిన్నర్



పారిస్: క్లేకోర్ట్ రారాజు రఫెల్ నడాల్ రిటైర్మెంట్ తర్వాత జరుగుతున్న తొలి ఫ్రెంచ్ ఓపెన్‌లో యువ హవా నడవనుంది. డిఫెండింగ్ చాంప్ కార్లోస్ అల్కరజ్, జానిక్ సిన్నర్ మధ్యే ప్రధాన పోటీ ఉంటుందనే అంచనాలున్నాయి. ఆదివారం నుంచి జరిగే టోర్నీలో సిన్నర్ టాప్ సీడ్‌గా బరిలోకి దిగుతున్నాడు. ఇక, రికార్డు స్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ వేటలో ఉన్న సెర్బియా యోధుడు నొవాక్ జొకోవిచ్.. రోలాండ్ గారోస్‌లోనే ఆ ఫీట్ పూర్తిచేయాలనుకొంటున్నాడు. అయితే, ఆరోసీడ్ జొకోవిచ్, సిన్నర్ ఒకే పార్శ్వంలో ఉండడంతో సెమీస్‌లో ఇద్దరూ తలపడే చాన్సుంది. తొలి రౌండ్‌లో మెకెంజీతో జొకో, ఆర్థర్ (ఫ్రాన్స్)తో సిన్నర్ తలపడనున్నారు. క్వాలిఫయర్ జిప్పరీ (ఇటలీ)తో అల్కారజ్ ఆడనున్నాడు. మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్ సబలెంక ఫేవరెట్ కాగా... మూడుసార్లు డిఫెండింగ్ చాంప్ స్వియటెక్, గతేడాది రన్నరప్ పౌలినీ, రెండో సీడ్ కొకో గాఫ్ టైటిల్ రేసులో ఉన్నారు.

షూటర్ ముకేశ్‌కు కాంస్యం

సుహ్లా (జర్మనీ): జూనియర్ షూటింగ్ ప్రపంచకప్‌లో గుంటూరు షూటర్ నేలవల్లి ముకేశ్ కాంస్య పతకం కొల్లగొట్టాడు. 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్‌లో ముకేశ్ మూడోస్థానంలో నిలిచాడు. మరో భారత షూటర్ నరేన్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో కాంస్యం నెగ్గాడు.

ఇంగ్లండ్ ఇన్నింగ్స్ విజయం

నాటింగ్‌హామ్: జింబాబ్వేతో ఏకైక టెస్టులో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ 45 పరుగుల తేడాతో గెలిచింది. తొలి ఇన్నింగ్స్‌ను ఇంగ్లండ్ 565/6 వద్ద డిక్లేర్ చేసింది. కాగా, జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 265 పరుగులకే ఆలౌటై ఫాలోఆన్‌లో పడింది. ఆటకు మూడో రోజైన శనివారం ఓవర్‌నైట్ స్కోరు 30/2తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన జింబాబ్వే 255 రన్స్‌కు కుప్పకూలింది.

ఖరీదైన బహుమతులు వచ్చాయా...



ఐటీ రిటర్నుల్లో వెల్లడించాల్సిందే..

భారతీయ సమాజంలో బహుమతులు (గిఫ్ట్) ఒక భాగం. పెళ్లిళ్లు, పేరంటాలు, పండగల సమయంలో బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడం మన సంప్రదాయం కూడా. ఇవి నగనట్రా, ఆస్తులు లేదా ఇతర విలువైన వస్తువుల రూపంలో ఉంటాయి. ఈ బహుమతులు తీసుకోవటం సంతోషం కలిగించినా.. ఒక ఆర్థిక సంవత్సరంలో అందుకున్న బహుమతుల విలువ రూ.50,000 మించితే వాటిపై పన్ను పోటు తప్పదు. ఐటీ రిటర్నులు సమర్పించేటప్పుడు విలువతో సంబంధం లేకుండా ఈ బహుమతుల వివరాలు వెల్లడించడం మంచిది. లేకపోతే భవిష్యత్‌లో సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది.

1958లోనే బహుమతులపై పన్ను కోసం ప్రభుత్వం గిఫ్ట్ ట్యాక్స్ యాక్ట్ తీసుకొచ్చింది. 1998లో ఈ చట్టాన్ని రద్దు చేశారు. అయితే 2004లో మళ్లీ బహుమతులను ఆదాయ పన్ను (ఐటీ) చట్ట సవరణ ద్వారా పన్నుల పరిధిలోకి తీసుకొచ్చారు. ఐటీ చట్టంలోని సెక్షన్ 56 ప్రకారం నిర్ణీత విలువ దాటిన బహుమతులు 'ఇతర ఆదాయం' కింది పరిగణించి వాటిని అందుకున్న వ్యక్తుల నుంచి పన్ను వసూలు చేస్తారు.

వీరికి మినహాయింపు: ఐటీ చట్టంలో పేర్కొన్న దగ్గరి బంధువులు, కుటుంబసభ్యుల నుంచి అందే బహుమతులకు విలువతో సంబంధం లేకుండా పూర్తి పన్ను మినహాయింపు లభిస్తుంది.

ఇతరుల నుంచి వస్తే: ఎవరైనా ఒక వ్యక్తికి ఒక ఆర్థిక సంవత్సరంలో బంధువులు కాని వ్యక్తుల నుంచి రూ.50,000 కంటే ఎక్కువ విలువైన బహుమతులు అందితే వారిపై పన్ను పోటు తప్పదు. దీన్ని ఇతర ఆదాయంగా పరిగణించి పన్ను విధిస్తారు.

ఎవరు బంధువులు: ఐటీ చట్టం ప్రకారం తల్లిదండ్రులు, తోబుట్టువులు, జీవిత భాగస్వాములు, వారి తల్లిదండ్రులు, తోబుట్టువులు, పిల్లలు, తాతలు, అమ్మమ్మలు, నాయనమ్మలు, మనవళ్లు, మనవరాళ్లు దగ్గరి బంధువుల పరిధిలోకి వస్తారు. వీరి నుంచి మనకి, మన నుంచి వీరికి అందే బహుమతులపై ఎలాంటి పన్ను వర్తించదు.

పన్ను పోటు లేని బహుమతులు

- పెళ్లిళ్ల సమయంలో వధూవరులకు వచ్చే గిఫ్టులు
- ఐటీ చట్టం పేర్కొన్న దగ్గరి బంధువుల నుంచి అందే బహుమతులు
- వారసత్వంగా లేదా వీలునామా ద్వారా సంక్రమించే గిఫ్టులు
- ప్రభుత్వం వద్ద నమోదైన మతపరమైన, దాతృత్వ ట్రస్టుల నుంచి అందే బహుమతులు
- ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆస్పత్రులు, వైద్య సంస్థల నుంచి అందే గిఫ్టులు
- యూనివర్సిటీలు, విద్యా సంస్థల నుంచి అందే ఉపకార వేతనాలు, గ్రాంట్లు, ఆర్థిక సాయం
- మున్సిపల్, స్థానిక ప్రభుత్వ సంస్థల నుంచి అందే బహుమతులు
- కేవలం ఒక వ్యక్తి ప్రయోజనం కోసం ఏర్పాటైన ట్రస్టుల నుంచి అందే బహుమతులు
- యాజమాన్య హక్కుల బదిలీ లేకుండా అందే బహుమతులు
- కార్లు, ఫోన్లు, టీవీలు, ఫర్నీచర్, వాచీల వంటి బహుమతుల విలువ రూ.50,000 మించినా పన్ను పోటు ఉండదు.

రిటర్నుల్లో ఎలా వెల్లడించాలి?

ఒక ఆర్థిక సంవత్సరంలో అందే బహుమతుల విలువ రూ.50,000 మించితే తప్పకుండా ఆ విషయాన్ని 'ఇతర ఆదాయం' సెక్షన్‌లో వెల్లడించాలి. ఒకవేళ వాటి విలువ రూ.50,000 కంటే తక్కువగా ఉన్నా 'ఎగ్జెంప్ట్ ఇన్‌కం' సెక్షన్‌లో వెల్లడించడం మంచిది. దీనివల్ల మన ఆదాయ వెల్లడిలో పారదర్శకత పెరిగి ఐటీ శాఖ మన రిటర్నులు స్క్రూటినీ చేసే అవకాశాలు తగ్గుతాయి.

బిజినెస్ ప్లస్

క్రెడిట్ కార్డుతో నగదు తీసుకుంటున్నారా..



తొలి రోజు నుంచే వడ్డీ

జాగ్రత్తలు తీసుకోకపోతే గుదిబండగా మారే ప్రమాదం

ఎప్పుడు ఎవరికి ఎలాంటి అవసరం వస్తుందో తెలియదు. ఆ సమయంలో చేతిలో డబ్బులు ఉంటాయనే గ్యారెంటీ లేదు. అప్పుడు బంధుమిత్రుల నుంచి లేదా బ్యాంకు నుంచి అప్పు చేయక తప్పదు. ఇవేవీ సాధ్యం కాకపోతే క్రెడిట్ కార్డు ద్వారా నగదు విత్‌డ్రా చేయడం ఒక్కటే మార్గం. అయితే ఇది అంత క్షేమం కాదు. ఇందుకు అధిక వడ్డీతో పాటు చార్జీల రూపంలోనూ భారీగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో క్రెడిట్ కార్డు ద్వారా అడ్వాన్స్ నగదు విత్‌డ్రాయల్స్‌లో ఉన్న సమస్యలు ఏమిటో తెలుసుకుందాం...

చార్జీలు

క్రెడిట్ కార్డు అంటేనే ఫీజులు, వడ్డీలు. ఇక ఈ కార్డులతో విత్‌డ్రా చేసే అడ్వాన్స్ నగదుపై వడ్డీ భారం మరింత ఎక్కువగా ఉంటుంది. ప్రతి నగదు విత్‌డ్రాయల్స్‌పై కనీసం రూ.250 నుంచి రూ.500 చొప్పున ఫీజు చెల్లించాలి. విత్‌డ్రా చేసే నగదును బట్టి ప్రతి లావాదేవీ విలువలో ఇది 2.5 శాతం నుంచి 3 శాతం వరకు ఉంటుంది. క్రెడిట్ కార్డు కంపెనీలు జారీ చేసే బిల్లింగ్ స్టేట్‌మెంట్‌లో ఈ చార్జీల వివరాలు ఉంటాయి.

వడ్డీ రేటు

క్రెడిట్ కార్డుల ద్వారా విత్‌డ్రా చేసే నగదు అడ్వాన్స్‌పై బ్యాంకులు నెలవారీ పద్ధతిలో వడ్డీ రేటు వసూలు చేస్తాయి. సాధారణంగా ఈ వడ్డీ రేటు 2.5 నుంచి 3 శాతం మధ్య ఉంటుంది.

లేటు చెల్లింపులు వద్దు

ఈ చెల్లింపులను ఒకేసారి వీలైనంత త్వరగా చెల్లించడం మంచిది. చేతిలో డబ్బులు లేవని కొద్దికొద్దిగా ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో చెల్లిస్తే ఫీజుల భారం తడిసి మోపెడవుతుంది. సాధారణంగా ఇది మిగిలిన బకాయి మొత్తంలో 15 నుంచి 30 శాతం వరకు ఉంటుంది. ఆలస్యంగా చేసే అడ్వాన్స్ నగదు చెల్లింపులు ఆర్థిక భారంతో పాటు క్రెడిట్ స్కోరునూ దెబ్బతీస్తాయి.

క్రెడిట్ కార్డుపై కొనే వస్తువుల బకాయిలు చెల్లించేందుకు కొంత ఇంటరెస్ట్ ఫ్రీ గడువు ఉంటుంది. అడ్వాన్స్ నగదు విత్‌డ్రాయల్స్‌కు ఇలాంటి సౌలభ్యం ఉండదు. నగదు విత్‌డ్రా చేసిన రోజు నుంచి చెల్లించే రోజు వరకు వడ్డీ భారం తప్పదు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ అడ్వాన్స్ నగదు విత్‌డ్రాయల్స్‌ను ఎంత త్వరగా చెల్లిస్తే అంత మంచిది.

పరిమితులు

క్రెడిట్ కార్డు చేతిలో ఉన్నంత మాత్రాన ఎంత పడితే అంత అడ్వాన్స్ నగదు విత్‌డ్రాయల్స్ కుదరవు. మీ క్రెడిట్ కార్డు క్రెడిట్ లిమిట్‌లో ఒక పరిమితికి లోబడి మాత్రమే ఈ నగదు ఉపసంహరణ సాధ్యం. ఒకవేళ దీన్ని ఉపయోగించుకున్నా ఆ మొత్తాన్ని నిర్ణీత గడువు లోగా ఒకేసారి చెల్లించాలి. లేకపోతే అది గుదిబండగా మారే ప్రమాదం ఉంది.



ఎల్ఐసీ గిన్నిస్ వరల్డ్ రికార్డు

ఒక్క రోజులో 5,88,107 పాలసీల విక్రయం

ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) సరికొత్త చరిత్ర సృష్టించింది. కేవలం 24 గంటల్లో 5,88,107 జీవిత బీమా పాలసీలను విక్రయించడం ద్వారా గిన్నిస్ వరల్డ్ రికార్డుల్లోకి ఎక్కింది. ఒక్క రోజులో ఇన్ని పాలసీలు అమ్మిన బీమా కంపెనీ ఇదే. ఈ జనవరి 20న సంస్థకు చెందిన 4,52,839 ఏజెంట్లు ఈ పాలసీలను విక్రయించినట్లు ఎల్ఐసీ వెల్లడించింది. "ఇది మా ఏజెంట్ల అవిశ్రాంత అంకితభావం, నైపుణ్యం, నైతికతకు బలమైన ధ్రువీకరణ. మా కస్టమర్లు, వారి కుటుంబాలకు బీమా ద్వారా ఆర్థిక రక్షణ కల్పించాలన్న మా లక్ష్యం పట్ల నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుంది" అని ఎల్ఐసీ పేర్కొంది. 'మ్యాడ్ మిలియన్ డే' పేరుతో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఈ జనవరి 20న ప్రతి ఏజెంట్ కనీసం ఒక పాలసీనైనా విక్రయించాలని ఎల్ఐసీ ఎండీ, సీఈఓ సిద్ధార్థ మొహంతి కోరారు. దాంతో ఏజెంట్లందరూ కలిసి రికార్డు స్థాయిలో పాలసీలను విక్రయించారు.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	119
వరంగల్	120	గుంటూరు	122
కరీంనగర్	120	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	111
కర్నూలు	120	నెల్లూరు	116
విశాఖపట్నం	116	అనంతపురం	116
గోదావరి	119		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



25వ తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	510
వరంగల్	502	గోదావరి	485
చిత్తూరు	603	విశాఖపట్నం	513

డజను గుడ్లు రూ. 72

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,080 ▲	89,900 ▲	1,10,900 ▼
విజయవాడ	99,700 ▲	93,500 ▲	99,700 ▼
విశాఖపట్నం	98,080 ▼	89,900 ▲	1,10,900 ▲
రాజమండ్రి	98,070 ▲	89,900 ▲	1,03,000 ▲
ప్రొద్దుటూరు	96,200 ▼	88,500 ▼	99,200 ▼
ముంబై	95,471	87,451	96,909

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో
ఐదుగురి మృతి


డాక్టర్ రాజశేఖర్ (ఫైల్)

గద్వాల క్రైం/బాలానగర్/ధన్వాడ/జడ్చర్ల, మే 24 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందారు. హైదరాబాద్‌లో ఫంక్షన్‌కు వెళ్లిన గద్వాల జిల్లా జనరల్ ఆసుపత్రి మెడికల్ డాక్టర్ డాక్టర్ రాజశేఖర్(27) రోడ్డు ప్రమాదంలో శనివారం ఉదయం మృతి చెందాడు. ఇటీవలే నూతనంగా కొనుగోలు చేసిన బుల్లెట్ బైక్‌పై గద్వాల నుంచి హైదరాబాద్‌కు శనివారం ఉదయం బయలు దేరారు. తిరిగి రాత్రి ఆసుపత్రిలో డ్యూటీ డాక్టర్‌గా విధులు నిర్వహించాల్సి ఉండటంతో ఫంక్షన్ ముగించుకొని తిరిగి శనివారం రాత్రి బయల్దేరాడు. అయితే హైదరాబాద్‌కు చేరుకోగానే బైక్ వేగం కారణమో... లేక నిద్రమత్తులో ఉన్నాడో తెలియదు కాని పీవీ నరసింహరావు ఫ్లైఓవర్ బ్రిడ్జిపై రోడ్డు డివైడర్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు అవివాహితుడు. కాగా, డాక్టర్ రాజశేఖర్ మృతి పట్ల గద్వాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఇందిర సంతాపం వ్యక్తం చేశారు. అంతేకాకుండా తమ డాక్టర్ మృతికి సంబంధించి పోస్టుమార్టం ప్రక్రియ త్వరగా పూర్తి చేసి పంపాలని హైదరాబాద్‌లోని ఉస్మానియా వైద్యసిబ్బందికి ఫోన్‌లో సూచించారు.

లారీ ఢీకొని మహిళ...

బాలానగర్ మండల కేంద్రంలోని ముఖ్య కూడలి 44వ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి సుమారు 12 గంటల సమయంలో రోడ్డు దాటుతున్న మహిళను హైదరాబాద్ నుంచి జడ్చర్ల వైపు వేగంగా ప్రయాణిస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలానగర్ మండలంలోని నేలబండ తండాకు చెందిన కాట్రావత్ నీల (39) తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల జనరల్ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు పెద్ద కూతురు కాట్రావత్ భూమిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లెనిన్ వెల్లడించారు. అదేవిధంగా, మరో రోడ్డు ప్రమాదంలో ఓ వక్తి మృతి చెందాడు. ఎస్సై లెనిన్ కథనం మేరకు.. పశ్చిమగోదావరి జిల్లా తణుకు చెందిన పరమేశ్వర్‌కుమార్ (42) హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఉంటూ వివిధ పనులు చేసుకొని జీవిస్తున్నారు. తన సహచరులు ఆరుగురితో కలిసి హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్తుండగా మండల కేంద్రంలో ముందు వస్తున్న కంటైనర్ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పరమేశ్వర్ తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. వాహనంలో ప్రయాణం చేస్తున్న మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదానికి గురైన కారును పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎంనోన్‌పల్లి గేట్ వద్ద..


రాజు (ఫైల్)

నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం ఎంనోన్‌పల్లి గేట్ వద్ద కొంకలి రాజు (26) అనే యువకుడు లారీని ఢీకొని మృతి చెందాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎంనోన్‌పల్లి హైవే రోడ్డుపై శుక్రవారం రాత్రి లోడ్‌తో ఉన్న లారీని నిర్లక్ష్యంగా అపుకొని ఉండగా, అదే రోడ్డుపై రాజు బైక్ వచ్చి లారీని ఢీకొట్టాడు. దీంతో ఈ ప్రమాదంలో గాయపడ్డ రాజును మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి ఉస్మానియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. ఈ సంఘటనపై ధన్వాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకోని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బైకు అదుపుతప్పి..

జడ్చర్ల మండలం గొల్లపల్లి సమీపంలోని లలితాంబిక తపోవనం వద్ద ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టుకున్న సంఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపిన వివరాల మేరకు... రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం పాల్మాకుల గ్రామానికి చెందిన గుడ్లసంజయ్(19), తన స్నేహితుడు సిద్దార్థ(20)తో కలిసి ఈ నెల శుక్రవారం రాత్రి 10.30 గంటల సమయంలో ద్విచక్రవాహనంపై జడ్చర్లకు వచ్చారు. పనిముగించుకుని అదే రోజు రాత్రి తిరిగి పాల్మాకుల వెళ్తుండగా గొల్లపల్లి వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ సంఘటనలో గుడ్ల సంజయ్, సిద్దార్థలు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం జిల్లా జనరల్ ఆసుపత్రికి మెరుగైన చికిత్స కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం ఉదయం గుడ్ల సంజయ్ మృతి చెందాడు. ఉస్మానియా ఆసుపత్రిలో సిద్దార్థ చికిత్స పొందుతున్నాడని పేర్కొన్నారు. మృతుడి బాబాయ్ గుడ్ల రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేడష్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉరివేసుకొని యువతి ఆత్మహత్య

» వచ్చే నెల 5న పెళ్లి నిశ్చయం

కల్వకుర్తి, మే 24 (ఆంధ్రజ్యోతి) : జూన్ 5న పెళ్లి కావాల్సిన ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఎస్ఐ మాధవరెడ్డి కథనం ప్రకారం.. కల్వకుర్తి పట్టణంలోని తిలక్‌నగర్‌కు చెందిన కృష్ణవేణి(24)శనివారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. జూన్ 5న పెళ్లి కావాల్సి ఉందని, మృతిపై అనుమానాలున్నాయని ఆమె తల్లి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు.

ప్రాణాపాయ స్థితిలో అదృశ్యమైన వ్యక్తి

బిజినేపల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజుల క్రితం అదృశ్యమైన బంగారయ్య(45) అనే వ్యక్తి కుంట నీటిలో ప్రాణాపాయ స్థితిలో లభ్యమైన ఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ కె.శ్రీనివాస్ శనివారం తెలిపిన వివరాల మేరకు .. బిజినేపల్లి మండలంలోని వెల్గొండ గ్రామానికి చెందిన బంగారయ్య ఈనెల 20వ తేదీన ఇంట్లో నుంచి బయటకు వెళ్లి కనబడకుండా పోయాడు. బాధితుడి తమ్ముడు గుంత కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తుండగా, మండలంలోని వట్టెం గ్రామ సమీపంలోని కుంటలో గుర్తు తెలియని వ్యక్తి ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి వెళ్లి బాధితుడిని వెంటనే 108లో నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.

97.91 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత


నారాయణపేటరూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట మండల పరిధిలోని అప్పిరెడ్డిపల్లి గ్రామంలో శనివారం అక్రమంగా తరలిస్తున్న 97.91 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని సివిల్ సప్లై డీటీ కాశప్ప, రూరల్ పోలీసులు పట్టుకున్నారు. అదే గ్రామానికి చెందిన బాలవర్ధన్ అనే వ్యక్తి ఇంటి వద్ద పీడీఎస్ బియ్యాన్ని బొలెరో వాహనంలో లోడ్ చేస్తుండగా నమ్మదగిన సమాచారం మేరకు పట్టుకున్నట్లు వారు తెలిపారు. పంచనామా అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ట్రైనీ ఎస్ఐ గాయత్రి తెలిపారు. అక్రమంగా నిల్వ ఉంచినా, అమ్మినా, రవాణా చేసినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

విద్యుదాఘాతంతో నాలుగు మేకలు మృతి


విద్యుదాఘాతానికి మృతి చెందిన మేకలు

గద్వాల, మే 24 (ఆంధ్రజ్యోతి) గద్వాల మండల పరిధిలోని అనంతాపురం గ్రామంలో శనివారం విద్యుదాఘాతంతో నాలుగు మేకలు మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. పరశురాముడు మేకలు మేపడానికి గ్రామ సమీపంలోకి వెళ్లాడు. సాయంత్రం వర్షం కురిసింది. ఈ వానకు మేకలు తలదాచుకోవడానికి సెల్ టవర్ దగ్గరకు వెళ్లగా అక్కడ ఉన్న ఒక స్విచ్ బోర్డుకు విద్యుత్ సరఫరా ఉండటంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు వారు తెలిపారు. ఈ మేకల విలువ రూ.50 వేలు ఉంటుం దని వారు తెలిపారు.

రెండు ఎలిమెంట్లతో
నీటి వృథాకు చెక్


మరమ్మతులలో ఉన్న రూఫ్ వే ఐరన్ తాడు

» చివరి దశకు చేరిన మరమ్మతు పనులు

» ఎగువ నుంచి 4వేల క్యూసెక్కులకు పైగా వరద


జూరాల ప్రాజెక్టుపై సిద్ధంగా ఉన్న స్టాఫ్ లాక్ ఎలిమెంట్

అమరచింత, మే 24(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు వరప్రదాయినిగా ఉన్న జూరాల ప్రాజెక్టులో దిగువకు వృథా నీరు వెళ్లకుండా శనివారం అధికారులు మరో రెండు స్టాఫ్ లాక్ ఎలిమెంట్‌ను అమర్చారు. ప్రాజెక్టు 40, 49, 56 గేట్ల వద్ద రూఫ్ వే తాడు మరమ్మతు కోసం జూరాల బ్యాక్ వాటర్‌లో ఇప్పటికే ఒక్కొక్క గేటు వద్ద 5 స్టాఫ్ లాక్ ఎలిమెంట్లను అమర్చి ముందు భాగం మరమ్మతు పనులు చేస్తున్నారు. అయినప్పటికీ ఎగువ నుంచి వస్తున్న వరద కారణంగా ఎలిమెంట్లపై నుంచి దిగువకు గత ఐదు రోజులుగా వృథాగా నీరు వెళ్తూనే ఉన్నాయి. వరుస కథనాల కారణంగా శనివారం ప్రాజెక్టు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీచుపల్లి ఆధ్వర్యంలో మరమ్మతులు జరుగుతున్న ఒక్కొక్క గేటు వద్ద మరో రెండు స్టాఫ్ లాక్ ఎలిమెంట్లను అమర్చి, ప్రస్తుతం దిగువకు వరద నీరు వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం 5.012 టీఎంసీల నీరు ఉంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జూరాల ప్రాజెక్టుకు శనివారం ఎగువ నుంచి 4172 క్యూసెక్కుల వరద ప్రాజెక్టులో చేరింది. దీంతో గత వారం 2 టీఎంసీలకు పడిపోయిన జూరాల ప్రాజెక్టు నీటి నిల్వలు తాజాగా ఎగువ నుంచి వస్తున్న వరద కారణంగా 5 టీఎంసీలకు చేరిందని చెప్పవచ్చు. మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రాజెక్టుకు వరద మరింత పెరిగే అవకాశం ఉంది.

ఈ విషయమే జూరాల ప్రాజెక్టు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీచుపల్లిని వివరణ కోరగా మిగిలిన 3 గేట్ల వద్ద మరమ్మతు పనులు చివరి దశలో ఉన్నాయని చెప్పుకొచ్చారు.

దేశాన్ని రక్షించడంలో మోదీ విఫలం

» మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలి

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

కల్వకుర్తి, మే 24 (ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాదుల నుంచి దేశాన్ని రక్షించడంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. అమెరికాపై చైనాతో పాటు చిన్న చిన్న దేశాలు టారీఫ్‌లు పెడుతుంటే ప్రధాని మోదీ మాత్రం అమెరికాకు మోకరిల్లాడాన్ని సీపీఎం ఖండిస్తుందని పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో సీపీఎం జిల్లా కమిటీ సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశానికి సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్‌వెస్లీ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సాగర్ హాజరయ్యారు. అనంతరం స్థానిక యూటీఎఫ్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జాన్‌వెస్లీ మాట్లాడారు. పాకిస్థాన్, భారత్‌ల యుద్ధం తన వల్లే ఆగిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెబుతున్నారని, దానిని మోదీ ఎందుకు ఖండించడం లేదన్నారు. కేంద్రం స్పందించి మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రానికి రావాల్సిన వాటాల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వినతులు ఇస్తే రావని పోరాటం చేసి సాధించుకోవాలని కోరారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కవిత లేఖపై స్పందించాలని, బీజేపీతో బీఆర్ఎస్ ఎందుకు మెతక వైఖరి అవలంభిస్తుందో బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 30న జిల్లా కలెక్టరేట్ల ముందు ధర్నాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సాగర్ మాట్లాడుతూ రాష్ట్రం వరి కొనుగోలు కేంద్రాలపై దృష్టి పెట్టడం లేదన్నారు. లారీల కొరత ఉందని, 40కేజీల బస్తాకు 2కేజీలు అదనంగా తూకం చేస్తున్నారన్నారు. దీనికి తోడు మిల్లుల వద్ద కూడా మరో రెండు కేజీలు తరుగు తీస్తుండడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారన్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లో పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్ట్ సిబ్బంది వేతనాలను వెంటనే డిమాండ్ చేశారు.

సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు, సీపీఎం నాయకులు బి.ఆంజనేయులు, సి.ఆంజనేయులు, పులిజాల పరుశరాములు, ఏపీ మల్లయ్య, చిలుక బాల్‌రెడ్డి, శ్రీనివాసులు, దేశ్యానాయక్, బాలస్వామి, జగన్ తదితరులు ఉన్నారు.

నీటి కుంటలో పడి ఇద్దరు చిన్నారుల మృతి

» గోపాల్‌పేట మండలం నర్సింగాయపల్లిలో విషాదం

గోపాల్‌పేట, మే 24(ఆంధ్రజ్యోతి) : మేకలను మేపడానికి వెళ్లి ఇద్దరు చిన్నారులు నీటి కుంటలో పడి మృతి చెందిన విషాద ఘటన గోపాల్‌పేట మండలం నర్సింగాయిపల్లి గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గగనం వెంకటయ్య, కృష్ణమ్మ దంపతులకు కుమార్తె లిల్లీ (10) కుమారుడు గణేష్ (8) ఇద్దరు పిల్లలు. తండ్రి వెంకటయ్య గత 8 నెలల క్రితం అదే గ్రామ శివారులో చెట్టు మీద నుంచి కిందపడి మృతి చెందాడు. తల్లి కృష్ణమ్మ కూలీ పనులు చేసుకుంటూ.. ఐదు మేకలను కొనుగోలు చేసి కుమార్తె, కుమారుడితో మేతకు పంపేది. అలా శనివారం కూడా అక్క తమ్ముడు ఇద్దరు మేకలను మేతకు తీసుకుని వెళ్లారు. సాయంత్రం 7 గంటలైనా ఇద్దరు చిన్నారులు ఇంటికి రాకపోవడంతో, తల్లి చుట్టుపక్కల ఉన్న వారితో కలిసి గ్రామ సమీపంలో వెతికి పక్కనే ఉన్న కుంట దగ్గరికి వెళ్లి చూశారు. కుంట సమీపంలో వారి చెప్పులు పడి ఉండటం చూసి వెంటనే గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. వారు ఫైర్ సిబ్బందికి తెలుపడంతో ఘటన స్థలానికి చేరుకున్నారు. దాదాపు 2 గంటలకు పైగా శ్రమించిన ఫైర్ సిబ్బంది కుంటలో ఇద్దరు చిన్నారుల మృతదేహాలను వెలికి తీశారు.

కాగా, ఉదయం 10 గంటల వరకు కళ్ల ముందు ఉన్న చిన్నారులు సాయంత్రం వరకు శవాలుగా ఇంటికి రావడంతో తల్లి కృష్ణమ్మ గుండెలు పగిలేల రోదించింది. గత 8 నెలల కిందట భర్త, ఇప్పుడు చిన్నారులు మృతి చెందడంతో దిక్కుతోచని స్థితిలో ఆమె పరిస్థితి తయారైంది.

రిజర్వాయర్ వద్దు.. భూములే కావాలి

భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ అరుణరెడ్డికి రైతుల వినతి


భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ అరుణారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న రైతులు

బల్మూరు, మే 24 (ఆంధ్రజ్యోతి) : ఉమామహేశ్వర రిజర్వాయర్ భూసేకరణ రైతు అవగాహన సదస్సుకు వచ్చిన ప్రత్యేక కలెక్టర్ అరుణారెడ్డికి రైతులు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని భూనిర్వాసితుల సమన్వయ కమిటీ అధ్యక్షుడు అనంత సీతారాంరెడ్డి ఆధ్వర్యంలో రైతులు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సీతారాంరెడ్డి మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను పూర్తిస్థాయిలో సభలో చదివి విన్పించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో రిజర్వాయర్ నిర్మాణం చేపడితే ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు సంబంధించిన వారు భూములు కోల్పోయి జీవనోపాధి లేకుండాపోతున్నారని, వారిని దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాంతంలో రిజర్వాయర్‌ను నిర్మాణం చేపట్టకూడదని ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పోలీసులకు, రైతులకు కొంత తోపులాట చోటు చేసుకుంది. అదేవిధంగా శనివారం తెల్లవారుజామున సీతారాంరెడ్డితోపాటు మరికొంతమంది ముఖ్య పాత్ర పోషించే రైతులను ఉప్పునుంతల పోలీస్‌స్టేషన్‌కు తరలించగా, వారిని వదిలిపెడితేనే ఈ అవగాహన సదస్సుకు హాజరవుతామని రైతులు పెద్ద ఎత్తున అంబేడ్కర్ చౌరస్తా వద్ద బైఠాయించారు. దీంతో ఎట్టకేలకు ఉన్నతాధికారుల సమాచారంతో వారిని మధ్యాహ్నం భోజన సమయంలో వదిలిపెట్టడంతో గందరగోళం మధ్య రైతుల అవగాహన సదస్సు కొనసాగింది.

ఈ సమావేశానికి రైతులు పెద్దగా హాజరు కాక పోయినా ఉన్నవారితోనే సదస్సు ముగించేశారు.

శనీశ్వర స్వామికి శాస్త్రోక్తంగా తైలాభిషేకాలు


నందివడ్డెమాన్‌లోని శనీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

బిజినేపల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి) : శ్రీ జేష్టాదేవి సమేత సార్థసప్త శనీశ్వర స్వామికి భక్తిశ్రద్ధలతో భక్తులు తిల, తైలాభిషేకాలతో ప్రత్యేక పూజలు నిర్వ హించినట్లు ఆలయ ప్రధాన పూజారి డాక్టర్ గవ్వమఠం విశ్వనాథశాస్త్రి తెలిపారు. మండల పరిధిలోని నందివడ్డెమాన్‌లోని నందీశ్వరాలయం ఆవరణలో ని శనీశ్వర స్వామికి శనివారం భక్తులు నల్లని వస్త్రాలు ధరించి నువ్వుల నూనె, జిల్లేడు పూలు, నల్లని నువ్వులు, నల్లని వస్త్రంతో పూజలు ఘనంగా చేశారు. శనీశ్వర స్వామిని ఏడు వారాల పాటు పూజించిన అనంతరం ఆలయ ఆ వరణలోని నందీశ్వరుడికి, పరమశివునికి వివిధ రకాల పండ్ల రసాలు, బిల్వ పత్రాలతో అభిషేకాలు, రుద్రాభిషేకాలు నిర్వహిస్తే స్వామి వారి కృపకు నోచుకుంటారని ప్రధాన అర్చకులు వివరించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చే భ క్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటి వసతి, అల్పాహారం ఏ ర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రావు తెలిపారు. కార్యక్రమంలో పూజారులు ఉమామహేశ్వర్, శాంతికుమార్, ఆలయ కమిటీ సభ్యులు ప్రభాకరాచారి, వీరశేఖర్, రాజేష్, ప్రభాకర్, పుల్లయ్య, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎముకల కంపెనీ వద్దంటూ గిరిజనుల ఆందోళన

వెల్దండ, మే 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నారాయణపూర్ స మీపంలో ఎముకల కంపెనీ ఏర్పాటును విరమించుకోవాలని స్థానిక గిరిజనులు శనివారం కంపెనీ ఏర్పాటు చేస్తున్న స్థలంలో ఆందోళన చేపట్టారు. హైదరాబాద్‌కు చెందిన కొందరు వ్యక్తులు దాదాపు 6 ఎకరాల్లో కంపెనీ ఏర్పాటు చేస్తున్నారని గ్రామస్థులు ఆరోపించారు.

ఈ మేరకు మండల అధికారులకు ఫిర్యాదు చేశామని వారు తెలిపారు. ఎ ముకల కంపెనీతో పంట పొలాలు పాడావుతాయని, దీంతో జీవనోపాధి కోల్పోతామని అన్నారు. ఈ విషయంపై అధికారులు చర్యలు తీసు కోకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేప డుతామని హెచ్చరించారు.

నకిలీ పంజా

(5వ పేజీ తరువాయి)

చేయడం వంటి వాటివల్ల పెద్దగా ఉపయోగం ఉండదు. అవి ఎలా తయారవుతున్నాయి?, ఎక్కడి నుంచి ఎక్కడికి సరఫరా అవుతున్నాయనే విషయంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. సాధారణంగా జోగుళాంబ గద్వాల జిల్లాలో సీడ్ పత్తిసాగు అధికంగా జరుగుతుంది. ఇక్కడి నుంచే రాష్ట్రవ్యాప్తంగా విత్తనాలు సరఫరా అవుతాయి. కంపెనీలు ఇచ్చిన ఫౌండేషన్ సీడ్‌ను సాగు చేసిన రైతులు విత్తనాలను ఆర్గనైజర్లకు విక్రయిస్తారు. తర్వాత కంపెనీలు వాటి శాంపిళ్లు తీసుకెళ్లి, జీవోటీ పరీక్షలు నిర్వహిస్తాయి. అందులో విత్తనాలు పాస్ అయితే అప్పుడు మొత్తం విత్తనాలను కంపెనీలు తీసుకుంటాయి. ఒకవేళ ఫెయిల్ అయితే గతంలో రైతులకు అప్పగించేవారు. సదరు రైతులు ఊర్లకు తిరిగి.. కిలోల లెక్కన ఆ విత్తనాలను రైతులకు అంటగట్టేవారు. అయితే వాటివల్ల పంటనష్టం అధికంగా జరుగుతోందని భావించిన ప్రభుత్వం బీజీ-3 విత్తనాలపై నిషేధం విధించింది. వాటిని కలిగి ఉన్నా, సరఫరా లేదా విక్రయించినా కేసులు నమోదు చేస్తున్నారు. అయితే ఆ ఫెయిల్ అయిన విత్తనాలను క్రష్ చేసి, రైతులకు అప్పగించాలనే నిబంధన ఉన్నప్పటికీ.. ఇప్పటివరకు ఆర్గనైజర్లు ఆ విధంగా కంపెనీలకు అప్పగించడం లేదు. అన్ సీజన్ సమయంలో ఇతర వ్యాపారులకు వాటిని విక్రయిస్తున్నారు. కంపెనీలు కూడా ఫెయిల్ అయిన విత్తనాలు ఏమవుతున్నాయనే విషయాలను పట్టించుకోవడం లేదు. ఫెయిల్ విత్తనాలను ఏటా క్రష్ చేయించగలిగితే నకిలీ విత్తనాల దందాను నియంత్రించే అవకాశం ఉంది. కానీ ప్రభుత్వం ఆ దిశగా ఆలోచనలు చేయడం లేదు.

రేపటి నుంచి లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణ

» తొలి విడతలో 120 మంది ఎంపిక

వనపర్తి రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టం అమలులో భాగంగా నిరుద్యోగులకు ఉపాధి కల్పించే దిశగా లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామక ప్రక్రియపై నెలకొన్న అయోమయం తొలగిపో యింది. అభ్యర్థులు కోరుకున్నట్లుగా సోమవారం నుంచి వనపర్తి జిల్లా కేంద్రంలోని ఆర్‌డీవో కార్యాలయంలో, పాలిటెక్నిక్ కళాశాలలో 50 రోజుల శిక్షణ ఇవ్వనున్నారని జిల్లా సర్వేయర్ బాలకృష్ణ తెలిపారు. ఇందుకోసం తొలి విడత శిక్షణకు 120 మంది అభ్యర్థులు ఎంపిక చేస్తూ శనివారం జాబితాను విడుదల చేసింది. మలి విడతల్లో మిగిలిన అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు అధికార వర్గాలు చెబుతుండటంతో తాజా జాబితాలో చోటు దక్కని వారికి ఊరటనిస్తున్నది. భూ వివాదాల శాశ్వత పరిష్కారానికి రిజిస్ట్రేషన్ల సమయంలో నక్ష సమర్పించాలని నిబంధన విధించింది. ప్రభుత్వం సర్వేయర్ల కొరత దృష్ట్యా లైసెన్స్ సర్వేయర్ల నియామకానికి శ్రీకారం చుట్టింది. ఇందుకోసం జిల్లాల వారీగా ఈనెల 17 వరకు నిరుద్యోగ అభ్యర్థుల నుంచి మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు స్వీకరించింది. జిల్లా వ్యాప్తంగా 220 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఎవరిని ఎంపిక చేస్తారో తెలియని అయోమయం అభ్యర్థులను వెంటాడింది. దరఖాస్తు సమయంలోనే ని వేద ఫీజును వసూలు చేయడంతో అందరిని శిక్షణకు ఎంపిక చేయా లని డిమాండ్ వినిపించింది. అందుకు తగ్గట్టుగానే తొలి విడతల్లో 120 మందిని శిక్షణకు ఎంపిక చేసిన ప్రభుత్వం మలి విడతల్లో మిగిలిన 100 మందికి శిక్షణ ఇచ్చే దిశగా కార్యాచరణ రూపొందించింది. హైదరాబాద్ గచ్చిబౌలీలోనే తెలంగాణ సర్వే ట్రైనింగ్ అకాడమీలో రెండు నెలల పాటు శిక్షణ ఇస్తామని వెల్లడించడం అభ్యర్థులను నిరు త్సాహానికి గురి చేసింది. తాజాగా నోటిఫికేషన్‌లో ప్రస్తావించినట్లుగా జిల్లా కేంద్రంలోని శిక్షణకు ఏర్పాటు చేయడంతో అభ్యర్థులు ఆనందంలో మునిగిపోయారు.

ఆవులు తరలిస్తే కేసులు


పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద తనిఖీ కేంద్రంలో ఉన్న అధికారులు


అలంపూరుచౌరస్తా, మే 24 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగ నేపథ్యంలో ఆవులను తరలించే అవకాశం ఉండటంతో రాష్ట్ర సరిహద్దులలో తనిఖీలు ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో గత రెండు రోజుల క్రితం తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన ఉండవల్లి మండలం, పుల్లూరు శివారులోని టోల్‌ప్లాజా వద్ద తనిఖీ కేంద్రం ఏర్పాటు చేశారు. ఏపీ నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేస్తున్నారు. కళేబరాలకు తరలించే ఆవులను గుర్తించి కేసులు నమోదు చేయనున్నట్లు ఉండవల్లి ఎస్సై మహేష్ తెలిపారు. పశువైద్యాధికారులు, పోలీసులు సంయుక్తంగా ఈ తనిఖీల్లో పాల్గొంటున్నారు. శనివారం జిల్లా పశువైద్యాధికారి వెంకటేశ్వర్లు తనిఖీ కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఆయనతో పాటు అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వెంకటనారాయణ, పశువైద్యాధికారులు శంకరయ్య, వెంకటరాజు, భీమయ్య, సత్యమ్మలు ఉన్నారు.

దొంగతనానికి వచ్చి పట్టుబడిన యువకుడు

పోలీసులకు అప్పగించిన గ్రామస్థులు

కృష్ణ, మే 24 (ఆంధ్రజ్యోతి): దొంగతనానికి వచ్చి పట్టుబడిన సంఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండల పరిధిలోని గుడెబల్లూరు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి ఇద్దరు వ్యక్తులు కలిసి పూజారి గోపాల్ ఇంట్లో చొరబడి దొంగతనానికి పాల్పడుతుండగా కుటుంబ సభ్యులు ఇద్దరు వ్యక్తులలో ఒకరిని పట్టుకుని పోలీసులు అప్పగించారు. పూజారి గోపాల్ ఎటువంటి ఫిర్యాదు ఇవ్వకపోవడంతో అతన్ని వదిలి వేసినట్లు ఎస్ఐ నవీద్ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వృద్ధుడి మృతి


బాలయ్య (ఫైల్)

రేవల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి) : ఏదుల మండల చెన్నారం గ్రామానికి చెందిన బాలయ్య (69) చేపల వేటకి వెళ్లి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నారం గ్రామానికి చెందిన పెద్ద బాలయ్య ఉదయం దాదాపు 9 గంటల సమయంలో చేపల వేటకు వెళ్తున్నాని ఇంట్లో చెప్పి ఊర చెరువులో చేపలు పట్టడానికి కల్లు తాగి వెళ్లాడు. మత్తులో ఉన్న బాలయ్య ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బాలయ్య భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్ తెలిపారు.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ కోత

పాలమూరు, మే 24 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా ఆదివారం తాత్కాలిక విద్యుత్ కోత విధిస్తున్నట్లు పట్టణ ఏడీ తౌర్యానాయక్, టౌన్-2 ఏఈ అశోక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని శ్రీనివాసకాలనీ, పద్మావతికాలనీ, టీచర్స్‌కాలనీ, మర్లు, వడ్డెరబస్తీ, టీకే రెడ్డి కాలనీలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడొద్దు

భూత్పూర్, మే 24 (ఆంధ్రజ్యోతి) : రేషన్ బియ్యం పంపిణీలో ఎవరైన అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ జయలక్ష్మి రేషన్ డీలర్లను హెచ్చరించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో రేషన్‌డీలర్లతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. సన్న బియ్యం పక్కదారి పట్టకుండా డీలర్లు బాధ్యతగా పనిచేయాలన్నారు. ఎవరైన బియ్యం కొనేందుకు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని డీలర్లకు సూచించారు.

ఆలయ నిర్మాణానికి స్థల పరిశీలన

కోయిలకొండ, మే 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జమాల్‌పూర్‌లో గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు భీష్మరాజ్ ఫౌండేషన్ ద్వారా శివాలయాన్ని నిర్మించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం గ్రామంలో ఆలయ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు.

బొడ్రాయికి బోనాలు

మిడ్జిల్, మే 24 (ఆంధ్రజ్యోతి) మండలంలోని బోయిన్‌పల్లిలో బొడ్రాయి ఉత్సవాల్లో భాగంగా శనివారం బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. అంతకుముందు బొడ్రాయికి అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, అర్చకులు హరిప్రసాద్‌శర్మ పాల్గొన్నారు.

చౌడమ్మ అమ్మవారి విగ్రహం ప్రతిష్ఠాపన

జడ్చర్ల, మే 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బూర్గుపల్లిఓ యాదవుల కుల దేవత చౌడమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యజ్ఞం నిర్వహించి, శాస్త్రోక్తంగా వేదమంత్రాలతో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కృష్ణయాదవ్, మల్లేష్‌యాదవ్, మల్లేష్, రాములు, కుర్వశ్రీను, శ్రీశైలం, దశరథం, బుచ్చయ్య పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు

రాజాపూర్, మే 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ ఆలయ నిర్మాణానికి శనివారం దాతలు విరాళాలు అందజేశారు. గ్రామానికి చెందిన పోలేపల్లి యాదయ్య, రూ.1,51,000, మలగల నర్సింములు రూ.51,000, పోలెపల్లి నర్సింములు రూ.51,000, మల్లి రాజు రూ.51,000 అందజేశారు. మహిపాల్‌రెడ్డి, నరసింహమూర్తి, పుల్లారెడ్డి, మల్లయ్య, యాదయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలయ్య, నర్సింములు, అంజనేయులు, వెంకటేష్, చంద్రయ్య పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సభ్యుడిగా ఆది రవీంద్రబాబు

పాలమూరు, మే 24 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా ఆది రవీంద్రబాబు నియమితులయ్యారు. శనివారం బాధ్యతలు చేపట్టిన ఆయన ఎస్సీ, ఎస్టీలకు సామాజిక న్యాయం, అంటరానితనం నిర్మూలనపై సమర్థవంతంగా వ్యవహరిస్తానని తెలిపారు.

కొనసాగుతున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మే 24 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శనివారం జిల్లా వ్యాప్తంగా 19 కేంద్రాల్లో కొనసాగాయి. ఉదయం 9 నుంచి 12 గంటలకు నిర్వహించిన ప్రథమ సంవత్సరం పరీక్షలకు 4753 మంది విద్యార్థులకు గాను, 4546 మంది హాజరుకాగా, 207 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు నిర్వహించిన ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 1186 మంది గాను, 1098 మంది హాజరుకాగా 88 మంది గైర్హాజరయ్యారు.

కాల్వ మరమ్మతు చేపట్టాలి

దేవరకద్ర, మే 24 (ఆంధ్రజ్యోతి) : కోయిల్‌సాగర్ కుడి, ఎడమ కాల్వ మరమ్మతులు చేపట్టాలని ఆర్డీవో నవీన్‌కుమార్ ఇరిగేషన్ ఆధికారులకు సూచించారు. శనివారం మండలంలోని కోయిల్‌సాగర్ కుడి, ఎడమ కాల్వను పరిశీలించి, మాట్లాడారు. కాల్వలో పిచ్చి మొక్కలతో పాటు ధ్వంసమైన కాల్వ పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య ఉన్నారు.

ప్రతీ అంశం విద్యార్థులకు ఉపయోగపడాలి

భూత్పూర్, మే 24 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు ఐదు రోజుల పాటు నేర్చుకున్న ప్రతీ అంశం విద్యార్థులకు రెండింతలు రెట్టింపుగా అర్థమయ్యే విధంగా బోధించాలని ఎంఈవో ఉషారాణి సూచించారు. శనివారం ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈవో పాల్గొని, మాట్లాడారు. ఐదు రోజుల పాటు ఇక్కడ నేర్చుకున్న ప్రతీ విషయాన్ని ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలన్నారు. ఈ శిక్షణకు 96 మంది ఉపాధ్యాయులు హాజరుకాగా, ఆర్పీలు చంద్రశేఖర్, ఖాదరయ్య, ఆనంద్‌రెడ్డి, శ్రీనివాసులు, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు బాలరాజుగౌడ్ పాల్గొన్నారు.

నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు

» ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి



జడ్చర్ల మునిసిపాలిటీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, మే 24 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు. జడ్చర్ల మునిసిపాలిటీలోని 20, 2వ వార్డులో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు మంజూరీ పత్రాలు అందజేసి, మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల ప్రొసిడింగ్‌లు వచ్చాయని, నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరీ అయ్యాయని, ఆరు నెలల్లో మరో 3500 ఇళ్లు మంజూరీ అవుతాయని తెలిపారు. మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ పాలాది సారిక, కౌన్సిలర్ శ్రావణిశ్యామ్, మునిసిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, బాదిమి శివకుమార్, కాంగ్రెస్ నాయకులు లక్ష్మయ్య, మినాజ్, నిత్యానందం, అశోక్‌యాదవ్, విజయభాస్కర్‌రెడ్డి, పెద్ది బాలకృష్ణ పాల్గొన్నారు.

గత ఎమ్మెల్యే హయాంలో మారిన హైవే అలైన్‌మెంట్

167వ జాతీయరహదారి విస్తరణ, రోడ్డు నిర్మాణంలో భాగంగా జడ్చర్ల మునిసిపాలిటీలో బీఆర్‌ఎస్ నాయకుల కోసమే హైవే అలైన్‌మెంట్‌ను గత ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మార్చారంటూ ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ఆరోపించారు. జాతీయ రహదారి విస్తరణలో నిర్మాణాల తొలగింపులో ఇతర ప్రాంతాల్లో నష్ట పరిహారాన్ని కేంద్రం ఇచ్చిందని, జడ్చర్ల పట్టణంలోని బాధితులకు ఇవ్వకపోయినా కనీసం మాజీ ఎమ్మెల్యే పట్టించుకోలేదని, అయినా జాతీయ రహదారి విస్తరణ బాధితులకు పరిహారం కోసం కృషి చేస్తానని వెల్లడించారు. జడ్చర్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధితులు దరఖాస్తులు ఇవ్వాలని కోరారు. బాధితులకు నష్టపరిహారం ఇవ్వాల్సిందేనని ఎన్‌హెచ్ఏఐ అధికారులతో మాట్లాడి స్పష్టం చేయడం జరిగిందన్నారు. జాతీయ రహదారి నిర్మాణంలో కొందరి ఇళ్లు కొట్టివేయాల్సి వస్తుందన్న కారణంగా హైవే డిజైన్ మార్చారని, ఈ కారణంగానే రోడ్డుకు ఒక వైపు ఎక్కువగా, మరో వైపు తక్కువగా కొట్టేసారని, ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. అలైన్‌మెంట్ మార్చడంతోనే ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. జాతీయ రహదారుల శాఖ కేంద్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లి బాధితులందరికీ పరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

» ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

» 76 మందికి రూ.31.71 లక్షల సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, మే 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలో 76 మందికి రూ.31.71 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులు మంజూరు కాగా శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వాటిని బాధిత కుటుంబాలకు అందజేసి, మాట్లాడారు. ఆర్థిక ఇబ్బందులతో కార్పొరేట్ వైద్యం చేయించుకోలేక ఎంతో మంది ఇబ్బంది పడుతుంటారని, పేదలు కూడా కార్పొరేట్ వైద్యం చేయించుకుంటే వారి వైద్య ఖర్చులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక సాయం అందజేస్తుందన్నారు. రూ.5 లక్షల వరకు ఉన్న రాజీవ్ ఆరోగ్యశ్రీని రూ.10 లక్షలకు పెంచడం జరిగిందని గుర్తుచేశారు. ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, నాయకులు మహేందర్, సుధాకర్‌రెడ్డి, రాంచంద్రయ్య, శ్రీనివాస్‌యాదవ్, అవేజ్, ఫయాజ్, అజ్మత్‌అలీ, నాగరాజు, గోవింద్‌యాదవ్, సంజీవ్‌రెడ్డి, మోయిజ్, రఘు పాల్గొన్నారు.

దళారులను నమ్మొద్దు

హన్వాడ : ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తామని, ఇందిరమ్మ ఇంటి బిల్లు మంజూరిలో దళారులను నమ్మొద్దని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని నాయినోనిపల్లి, సల్లోనిపల్లి, హన్వాడ, పల్లెమోని కాలనీలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ప్రొసిడింగ్‌లు ఇచ్చారు. మార్కెట్ కమిటీ చైర్మన్ అనిత, మండల అధ్యక్షుడు మహేందర్, నాయకులు సురేందర్‌రెడ్డి, ఎన్‌పీ వెంకటేష్, కృష్ణయ్య, చెన్నయ్య, కలీం, నవనీత, ప్రవీణ్, వెంకటాద్రి, వెంకటయ్య పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ జానకి

దేవరకద్ర, మే 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ జానకి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. పోలీసులు, వ్యవసాయాధికారులతో కలిసి టీంలను ఏర్పాటు చేసి, సీడ్స్ దుకాణాలను తనిఖీ చేయాలన్నారు. రైతులు కూడా విత్తనాల కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటించాలన్నారు. అదే విధంగా మండలంలో దొంగతనాల నివారణకు నియంత్రణకు బస్టాండ్, స్టేషన్ ఏరియా, కోయిల్‌సాగర్ రోడ్డు వెంట గస్తీ నిర్వహించాలన్నారు. గతంతో పోలిస్తే క్రైం రేటు తగ్గిందన్నారు. అనంతరం మండలంలోని సీడ్స్ దుకాణాన్ని వ్యవసాయాధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఎస్ఐ నాగన్న పాల్గొన్నారు.

అవసరం మేరకే రసాయనాలు వాడాలి



రైతులతో శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

రాజాపూర్, మే 24 (ఆంధ్రజ్యోతి) : రైతులు సాగులో అవసరం మేరకు మాత్రమే రసాయనాలు వినియోగించాలని పాలెం పాలిటెక్నిక్ కళాశాల శాస్త్రవేత్తలు భరత్ భూషన్, వైస్ ప్రిన్సిపాల్ కల్యాణి అన్నారు. శనివారం మండలంలోని రంగారెడ్డిగూడ రైతువేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేతలు అనే కార్యక్రమంలో పాల్గొని, రైతులకు సూచనలు చేశారు. విత్తనాలు కొనుగోలు సమయంలో రసీదు పొందాలన్నారు. పంట మార్పిడి పద్ధతి పాటించి, సుస్థిర ఆదాయం పొందాలన్నారు. ఏవో ప్రదీప్, ఏఈవోలు శ్రీనివాస్, దీపిక పాల్గొన్నారు.

బీసీలకు స్ఫూర్తి జయరాములు యాదవ్



నివాళి అర్పిస్తున్న బీసీ సమాజ్ ప్రతినిధులు

పాలమూరు, మే 24 (ఆంధ్రజ్యోతి) : బీసీ ముద్దుబిడ్డ, 1978లోనే వనపర్తి ఎమ్మెల్యేగా ఎన్నికైన మేధావి, దివంగత జయరాములు యాదవ్ అని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో జయరాములు యాదవ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జయరాములు స్ఫూర్తితో ఉమ్మడి జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాలు బీసీలు కేవసం చేసుకోవాలన్నారు. వడ్డెర సంఘం అధ్యక్షుడు చంద్రయ్య, ఎంబీసీ అధ్యక్షుడు తల్లోజు శేఖరాచారి, సగర సంఘం ప్రేమ్‌సాగర్, జాంగ్ర సంఘం మహేందర్, కుమ్మరి సంఘం బుగ్గన్న, యాదవ జుర్రు నారాయణ, ఉస్మిల్లా, వెంకట్రాములు, సత్యనారాయణ, పద్మశాలి సుకుమార్, నాయీ బ్రాహ్మణ సంఘం అశ్విని సత్యం, వనజీవి రామానంద్, అంజనేయులు, శ్రీను, తాయప్ప, వీరప్ప, లక్ష్మణ్‌నాయక్, వేణుగౌడ్, దస్తయ్య, రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆరోపణలు అవాస్తవం

జడ్చర్ల, మే 24 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారి పరిహారం అంశంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆరోపణలు అవాస్తవమని శనివారం బీఆర్‌ఎస్ పార్టీ ఒక ప్రకటన విడుదల చేశారు. జడ్చర్ల నుంచి కోదాడ వరకు 220 కిలో మీటర్ల 167వ జాతీయ రహదారి జడ్చర్ల, కల్వకుర్తి, దేవరకొండ, హలియా పట్టణాల మీదుగా జరిగిన నిర్మాణంలో అనేక మంది భవనాలు, ఇళ్లు కోల్పోయారని పేర్కొన్నారు. జడ్చర్లతో పాటు ఎక్కడా బాధితులకు పరిహారం ఇవ్వలేదని పేర్కొన్నారు. నియమ, నిబంధనల ప్రకారం రోడ్డు మధ్య నుంచి 50 ఫీట్ల తర్వాత ఇళ్లు, భవనాలు కోల్పోయిన వారికి పరిహారంను ఎన్‌హెచ్ఏఐ అందించే రూల్ ఉందని వివరించారు. అలాగే జడ్చర్ల నుంచి కర్నాటకలోని చించోలి వరకు చేపట్టాన జాతీయ రహదారి నిర్మాణంలో సైతం ఇదే తరహా నిబంధనలు ఉన్నాయని తెలిపారు.

జడ్చర్లలో తిరంగా ర్యాలీ



జడ్చర్లలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

జడ్చర్ల, మే 24 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సింధూర్ విజయవంతం అయిన సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో శనివారం జడ్చర్లలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. మనం సైతం - దేశం కోసం, సైనికులకు వందనం పేరుతో ఈ ర్యాలీ నిర్వహించారు. జడ్చర్ల క్రాస్‌రోడ్డు నుంచి సిగ్నల్‌గడ్డ మీదుగా నేతాజీచౌరస్తా వరకు వర్షంలో సైతం ర్యాలీ కొనసాగింది.

మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ జన్మదినం

జడ్చర్ల, మే 24 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ జన్మదిన వేడుకలను శనివారం పట్టణంలోని ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రశేఖర్ నివాసంలో అభిమానులు భారీ కేకును కట్ చేయించారు.

పాతబజారుకు రోడ్డు సౌకర్యం కల్పించాలి

» అఖిలపక్షం సమావేశంలో నాయకుల డిమాండ్



జడ్చర్లలో సమావేశమైన అఖిల పక్షం నాయకులు

జడ్చర్ల, మే 24 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీలోని పాతబజారుకు సిగ్నల్‌గడ్డలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి నేరుగా రోడ్డు సౌకర్యం కల్పించాలని అఖిల పక్షం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని గౌడఫంక్షన్ హాల్‌లో శనివారం అఖిల పక్షం నాయకులు సమావేశం నిర్వహించారు. జాతీయ రహదారి విస్తరణ, రోడ్డు నిర్మాణంలో భాగంగా ప్రస్తుతం ఉన్న రోడ్డు సౌకర్యాన్ని తొలగించి, అంబేడ్కర్ చౌరస్తా నుంచి కాకుండా నెహ్రూ చౌరస్తా నుంచి యూటర్న్ తీసుకుని మళ్లీ అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఎడమ వైపు నుంచి పాతబజారుకు వెళ్లేలా రోడ్డు డిజైన్ చేయడం జరిగిందన్న విషయాన్ని నాయకులు లేవనెత్తారు. ద్విచక్రవాహనాలు, కార్లు మాత్రమే వచ్చేలా డిజైన్ చేశారని, పెద్ద వాహనాలు రావడానికి వీలులేకుండా రోడ్డు నిర్మాణం చేపడుతున్నారని తెలిసిందని, దీంతో పాతబజారుకు తీరని నష్టం జరుగుతుందంటూ అఖిలపక్షం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రహదారిని రీ డిజైన్ చేయించి, అంబేడ్కర్ చౌరస్తా నుంచి పాతబజారుకు నేరుగా రోడ్డు సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం జడ్చర్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. కౌన్సిలర్లు ప్రశాంత్‌రెడ్డి, నందకిశోర్‌గౌడ్, ఉమాశంకర్ గౌడ్, రమేశ్, అఖిలపక్షం నాయకులు సీతారాం ఝూవర్, పిట్టళ మురళి, హఫీజ్, ముచ్చర్ల కృష్ణయ్య, పాలాది రాంమోహన్, వీడియో శ్రీను, సాహితిరెడ్డి పాల్గొన్నారు.

అత్యాధునిక పద్ధతిలో వాస్క్యులర్ శస్త్ర చికిత్స



మాట్లాడుతున్న డాక్టర్ రంజిత్‌కుమార్

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), మే 24 (ఆంధ్రజ్యోతి) : అత్యాధునిక పద్ధతిలో వాస్క్యులర్ శస్త్ర చికిత్స అందుబాటులోకి వచ్చిందని యశోద ఆసుపత్రి మలకోపేట హైదరాబాద్ వాస్క్యులర్, ఎండో వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ రంజిత్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జడ్చర్ల మండల కేంద్రానికి చెందిన కృష్ణారెడ్డి అనే రోగి కుడికాలు వాపు, సెప్టిక్ షాక్, కిడ్నీకి తీవ్రమైన గాయం, మయోకార్డియల్ స్టన్నింగ్ వంటి లక్షణాలతో యశోద ఆసుపత్రికి వచ్చారని, దీంతో ఆయనకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి థ్రాంబస్, డీప్ వేయిన్ థంబోసిస్‌తో పాటు మల్టీ ఆర్గాన్ డిస్ఫంక్షన్ ఉన్నట్లు గుర్తించారు. వెంటనే అతనికి అత్యాధునిక వాస్క్యులర్ సర్జరీ చేసి రోగి ప్రాణాలు కాపాడామని వెల్లడించారు. అయితే ఈ వ్యాధి ఉన్నవారు రక్తం గడ్డకట్టి ప్రాణాలు కూడా పోయే ప్రమాదం ఉంటుందన్నారు. సమావేశంలో అపోలో సిబ్బంది శ్రీనివాస్, వాసుకిరన్‌రెడ్డి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు : కలెక్టర్

మహబూబ్‌నగర్ న్యూటౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పరిపాలన అధికారుల స్క్రీనింగ్ పరీక్షకు నిమిషం ఆలస్యమైన పరీక్ష కేంద్రంలోకి అనుమతి లేదని కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. శనివారం గ్రామ రెవెన్యూ అధికారుల స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణపై హైదరాబాద్ నుంచి రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ.. జిల్లాలో 152 మంది వీఆర్‌వోలు, వీఆర్ఏలు దరఖాస్తు చేసుకున్నారని వారికి ఆదివారం రాత పరీక్ష నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని చైతన్య హై స్కూల్‌లో నిర్వహించే ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు నిర్వహించే పరీక్షకు నోడల్ అధికారి అబ్దుర్వర్‌ను నియమించినట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ మోహన్‌రావు, ఆర్డీవో నవీన్, పరీక్షల చీఫ్ సూపరింటెండ్ మహ్మద్ అహ్మద్ పాల్గొన్నారు.

గత ప్రభుత్వం చేసిందేమీ లేదు



ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు ఇస్తున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

మహమ్మదాబాద్ మే 24 (ఆంధ్రజ్యోతి) : గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలను నమ్మించి మోసం చేసిందని, తమ ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తోందని పరిగి ఎమ్మెల్యే టీ.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రలలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి హాజరై లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. అంతకముందు కంచిపల్లి మైసమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. డీసీసీబీ మాజీ అధ్యక్షుడు శ్రీని వాస్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నారాయణ పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) మే 24 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి జన్ ఆదివాసి న్యాయ మహా అభియాన్ (పీఎం జన్‌మన్) పథకం కింద కాంట్రాక్టు ప్రాతిపదికన ఏడాది పాటు పలు వైద్య సిబ్బంది పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ కృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో మెడికల్ ఆఫీసర్ (ఎంబీబీఎస్)-1, ల్యాబ్ టెక్నీషియన్-1, పారామెడికల్ కమ్ అసిస్టెంట్ పోస్టు-1 చొప్పున మెడికల్ మొబైల్ యూనిట్‌లో మొత్తం 3 పోస్టులకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 30న ఉదయం 12 గంటలకు సమీకృత కలెక్టరేట్‌లోని డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో ఉంటుందని, అభ్యర్థులు ఒరిజనల్ ధ్రువ పత్రాలతో హాజరుకావాలని కోరారు.

సీడ్స్ దుకాణాల్లో తనిఖీలు



జడ్చర్లలోని సీడ్స్ దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

పాలమూరు/జడ్చర్ల మే 24 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్, జడ్చర్ల పట్టణాల్లో శనివారం జిల్లా వ్యవసాయాధికారులు, పోలీసులు కలిసి 15 ఎరువులు, విత్తనాల షాపులను తనిఖీ చేశారు. జిల్లా వ్యవసాయాధికారులు ఏడీలు, ఎంఏవోల బృందం షాపులో స్టాకు రిజిస్టర్, బిల్లులు, రైతులకు స్టాకు సరఫరాను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం షాపుల్లో స్టాక్ మెయింటెయిన్ చేయాలని సూచించాలన్నారు. షాపుల యజమానులు రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అమ్మాలని తెలిపారు. తనిఖీల్లో సహాయ వ్యవసాయ సంచాలకులు పి.శ్రీనివాస్, ఎంఏవో గోపినాథ్, మురళీధర్, రాజేందర్ అగర్వాల్, జడ్చర్ల ఏవో గోపీనాథ్, ఎస్ఐలు సీనయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం : కేసు నమోదు

జడ్చర్ల, మే 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోడుపర్తి గ్రామానికి చెందిన మానసికస్థితి బాగాలేని వయస్సున జంగయ్య కనిపించడం లేదంటూ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపారు. అవివాహితుడైన జంగయ్య శివరాత్రికి వారం రోజుల ముందు శ్రీశైలం దేవస్థానానికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లాడని, తిరిగి నేటి వరకు రాలేదని సోదరుడు పాపయ్య ఫిర్యాదులో పేర్కొన్నాడని తెలిపారు. శనివారం చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన్నట్లు సీఐ తెలిపారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హన్వాడ, మే 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బుద్దారం గ్రామంలో బొడ్రాయి, పోచమ్మ, నాగుల ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో శనివారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎన్‌పీ వెంకటేష్, సురేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మహేందర్ పాల్గొన్నారు. అదే విధంగా మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ నాయకులు కరుణాకర్‌గౌడ్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు నరేందర్, మాజీ వైస్ఎ ంపీపీ కొండ లక్ష్మయ్య, శ్రీనివాసులు, మాధవులుగౌడ్, చెన్నయ్య, బసరెడ్డి, హరిచందర్‌నాయక్, వెంకన్న, తేజ, యాదయ్య పాల్గొననగా, బీజేపీ నాయకులు కొండ బుచ్చిరెడ్డి, కృష్ణవర్ధన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కొండలింగం, డాక్టర్ వెంకటయ్య, వడ్ల శేఖర్, రమణరెడ్డి, కృష్ణయ్యగౌడ్, రఘురాంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో జర్నలిస్ట్ తౌహిద్ మృతి

మహబూబ్‌నగర్, మే 24 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో చికిత్స పొందుతూ వీడియో జర్నలిస్ట్ తౌహిద్ (40) శనివారం మృతి చెందగా, నగరంలోని న్యూమోతీనగర్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. జర్నలిస్ట్ మృతి విషయాన్ని ప్రెస్‌క్లబ్ కార్యవర్గం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన తౌహిద్ భౌతికకాయాన్ని సందర్శించి, నివాళి అర్పించారు. అనంతరం ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నరేందర్‌చారి, నరేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. మృతుడి కుటుంబానికి ప్రెస్‌క్లబ్ తరపున ఆర్థిక సాయం అందిస్తామని, ప్రెస్ అకాడమి నుంచి ఆర్థిక సాయం అందేలా కృషిచేస్తామని ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నరేందర్‌చారి చెప్పారు. ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షుడు వెంకటేశ్, అంజిలయ్య, జాయింట్ కార్యదర్శి సతీష్, ఈసీ సభ్యులు వెంకట్‌రమణ, రాంకొండ, షాబుద్దీన్, అహద్‌సిద్దికి, జర్నలిస్టులు పాల్గొన్నారు.

'వక్ఫ్' సవరణను వ్యతిరేకిస్తూ నేడు బహిరంగ సభ

మహబూబ్‌నగర్ అర్బన్, మే 24 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఆల్ ఆదివారం జిల్లా కేంద్రంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు సభ నిర్వహణ కమిటీ కన్వీనర్ మౌలానా నయీంకౌసర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 7 గంటలకు బాలుర కళాశాల మైదానంలో ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షుడు మౌలానా ఖాలీద్ సైఫూల్లా రహిమానీ అధ్యక్షతన నిర్వహించే సభకు ముఖ్య అతిథిలుగా హైదరాబాద్ పార్లమెంట్ సభ్యుడు, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ, ముఫ్తిఖలీల్ అహ్మద్, కర్ణాటక మాజీ ఎంపీ సీఎం ఇబ్రాహీం, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.